
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3



కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 7 అక్టోబరు 2025



మడ అడవులపై కన్ను!

బంటుమిల్లి మండలంలో తవ్విన చేపల చెరువు



బంటుమిల్లి మండలంలో యథేచ్ఛగా మడ చెట్ల నరికివేత

నిన్నటి వరకు పెడన మండలంలో ఇష్టారాజ్యంగా మడ చెట్ల నరికివేత చేపట్టిన అక్రమార్కులు ఇప్పుడు రూటు మార్చారు. పది వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బంటుమిల్లి మండలంపై కన్నేశారు. యథేచ్ఛగా మడ చెట్లను నరికివేసి రాత్రికి రాత్రే రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో మడ చెట్లను నరికేస్తుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు సముద్రం నుంచి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.

- రాత్రికి రాత్రే రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు!
- వందల ఎకరాల్లో పాగావేసిన అక్రమార్కులు
- నిన్నటి వరకు పెడనలో.. నేడు బంటుమిల్లిలో దందా!
- మామూళ్ల మత్తులో జోగుతున్న రెవెన్యూ అధికారులు
- జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- గ్రామాలకు పొంచి ఉన్న సముద్ర ముప్పు

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం): బంటుమిల్లి మండలంలో సుమారుగా 10 వేల ఎకరాల విస్తీర్ణంలో మడ అడవి ఉంది. ఈ అడవి అంతా కూడా సముద్రానికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. తుఫాన్లు వచ్చిన సమయంలో మడ అడవి ప్రాంతం అత్యంత సమీపానికి సముద్రం నీరు వస్తుంది. దీంతో చాలా వరకు మడచెట్లు సముద్రపు ఉప్పునీటిలో ఉండేవి. మడచెట్ల నరికివేత లేని రోజుల్లో మడ అడవుల సమీపంలో ఉన్న పొలాల్లో బంగారం పండేది. నేల కూడా మంచి సారవంతంగా ఉండేది. పంట దిగుబడులు అత్యధికంగా ఉండేవి. ఇటువంటి పరిస్థితుల్లో అక్రమార్కుల కన్ను మడ అడవులపై పడింది. బంటుమిల్లి, మణిమేశ్వరం, నారాయణపురం, పాండ్రాక, రామాపురం, ఇంతేరులో భారీ స్థాయిలో మడచెట్లు నరికేస్తున్నారు. వందల ఎకరాలను రాత్రికి రాత్రే రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. అక్రమార్కుల చెరలో చిక్కిన భూములకు అంతే వేగంగా పట్టాలు కూడా వచ్చేస్తున్నాయి. ఆ వెంటనే ఇతరులకు లీజులకు ఇచ్చేస్తున్నారు. జెట్ స్పీడ్‌తో క్రయ విక్రయాలు జరిగిపోతున్నాయి. అనేక మంది చేతులు మారిపోతున్నాయి. ఈ పాపంలో స్థానిక రెవెన్యూ యంత్రాంగం భాగస్వామ్యం ఉందని విమర్శలు ఉన్నాయి. ఆర్డీవో కార్యాలయంలో కూడా అక్రమార్కులకు సహకారం లభిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మడచెట్ల మిగతా 4లో..

దెబ్బతిన్న పంట భూములు

మడచెట్ల నరికివేత ప్రారంభం కాగానే.. పంట పొలాలు కూడా కలుషితంగా మారిపోతున్నాయి. మడచెట్ల నరికివేత కారణంగా సముద్రం ఉప్పొంగినపుడు రొయ్యల చెరువులలోకి ఉప్పునీరు వస్తుంది. ఉప్పునీటిలో రొయ్యలు ఎక్కువగా బతుకుతాయన్న ఉద్దేశ్యంతో.. సముద్రపు పాయలకు గాడి కొడుతూ ఆ నీటిని రొయ్యల చెరువులలోకి మళ్లిస్తుంటారు. ఒక్కోసారి ఆటుపోట్ల కారణంగా సముద్ర పాయల నుంచి పెద్ద ఎత్తున ఉప్పునీరు రొయ్యల చెరువులలోకి వచ్చి అవి పొంగిపొర్లి పంట చేల మీదకు ఎగదన్నుతున్నాయి. దీంతో పంట పొలాలు ఉప్పునీటి కారణంగా దెబ్బతింటున్నాయి. పంటలు సరిగా పండని పరిస్థితి ఏర్పడుతోంది. బంటుమిల్లి కేంద్రంగా జరుగుతున్న మడచెట్ల నరికివేతపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వెల్లుబికుతోంది. అయా గ్రామాల ప్రజలు రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడంలేదు. జిల్లా యంత్రాంగానికి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మామూళ్ల మత్తులో రెవెన్యూశాఖ



బంటుమిల్లి మండల రెవెన్యూ యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోందని విమర్శలు వస్తున్నాయి. స్థానికంగా కొందరు వీఆర్వోలు మడచెట్ల నరికివేత పుణ్యమా అంటూ బాగా స్థిరపడ్డారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలిచిన వీఆర్వోలు కొందరు ఖరీదైన ప్లాట్లను, ఫ్లాట్లను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయానికి కూడా అవినీతి పాకింది. ప్రజలు ఫిర్యాదులు చేస్తుంటే అక్కడ మడ చెట్లు లేవు కదా అని అధికారులు వాదించే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఆర్డీవో కార్యాలయం ఉద్యోగి ఒకరు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉదంతం వెలుగుచూసింది.



విజయవాడలో సోమవారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి పురస్కారం అందుకుంటున్న చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ 6

టమోత!

కర్నూలులో కిలో రూ.2 కూడా పలకని టమాటా ధర

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రైతు బజార్లలో మాత్రం రూ.22

మార్కెటింగ్‌శాఖ అధికారుల తీరుపై విమర్శలు



రైతు బజారులో కిలో రూ.22కు విక్రయిస్తున్న టమాటాలు

విజయవాడ, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): కిలో టమాటా రూ.2లకు కూడా అమ్మలేక కర్నూలు జిల్లాలో రైతులు బాధలు పడుతుంటే ఉమ్మడి కృష్ణాజిల్లా రైతు బజార్లలో మాత్రం రూ.20 నుంచి రూ.22లకు అమ్ముతున్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే కర్నూలు మార్కెట్లో 15 రూపాయలు ఉందని, అక్కడి నుంచి ఇక్కడికి తీసుకురావడానికి మూడు రూపాయలు ఖర్చు అవుతుందని, కేజీకి మొత్తంగా 18 రూపాయలు ఖర్చు కాగా, రెండు నుంచి నాలుగు రూపాయల లాభానికి రైతు బజార్లో బోర్డ్ రేట్ ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు. అసలు రైతు బజార్ల మిగతా 4లో..

అవార్డు గ్రహీతలతో మంత్రి సుభాష్, కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు



ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం

స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి వాసంశెట్టి సుభాష్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధనను ఒక యజ్ఞం లా నిర్వహించి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు నిచ్చారు. సోమవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణితో కలిసి జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ వ్యాధి ముప్పు పొంచి ఉందని తెలిపారు. చల్లపల్లి గ్రామాన్ని 11 ఏళ్లుగా పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, పద్మావతిలను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 69 రాష్ట్ర స్థాయి అవార్డుల్లో జిల్లాకు నాలుగు దక్కడంతో పాటు జిల్లా స్థాయిలో 44 బహుమతులు రావడం గర్వకారణమన్నారు. ఇందుకు కలెక్టర్ బాలాజీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ 2047 స్వర్ణాంధ్ర సంకల్పానికి కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా పది సూత్రాల పథకం అమలు చేస్తున్నామన్నారు. మునిసిపాలిటీల్లో పెద్ద ఎత్తున స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, పద్మావతి తదితరులను అవార్డులిచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు, గుడివాడ కమిషనర్ మనోహరరావు, తాడిగడప కమిషనర్ నజీర్, మెప్మా పీడీ సాయిబాబు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డీఐసీ జీఎం వెంకట్రావు, డీపీటీవో వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ రాణి, జిల్లా టూరిజం అధికారి రామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా నిర్లక్ష్యం

వ్యవసాయ పరిశోధనాస్థానంపై నీలినీడలు

- రుద్రవరంలో 16.34 ఎకరాలు కేటాయింపు
- నేటికీ అధికారికంగా అప్పగించని అధికారులు
- అభివృద్ధికి రూ.5 కోట్లతో అంచనాలు
- ప్రతిపాదనలకే భవనాలు, ల్యాబ్, గోడౌన్, ప్రహరీ పరిమితం
- ఇబ్బందులు పడుతున్న శాస్త్రవేత్తలు, ఉద్యోగులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

వ్యవసాయ పరిశోధనాస్థానానికి కేటాయించిన భూమి



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనాస్థానంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. మచిలీపట్నం సౌత్ మండలం రుద్రవరంలోని గురుకుల జూనియర్ కళాశాల పక్కనే 16.34 ఎకరాలను నాలుగేళ్ల క్రితం కేటాయించినా నేటి వరకు కనీస వసతులు కల్పించలేదు. దీంతో శాస్త్రవేత్తలు, ఉద్యోగులు నిలువనీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మచిలీపట్నం రాడార్ కేంద్రం సమీపంలో పూరిస్థాయి హంగులతో 26 ఎకరాల విస్తీర్ణంలో మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనాస్థానం నడిచేది. నాలుగేళ్ల క్రితం పరిశోధనాస్థానం భూములను మచిలీపట్నం మెడికల్ కళాశాల నిర్మాణం కోసం తీసుకున్నారు. ఇక్కడున్న పరికరాలు మచిలీపట్నం మార్కెట్ యార్డులో భద్రపరిచారు. శాస్త్రవేత్తలు, సిబ్బంది పెడన రోడ్డులో ఉన్న జిల్లా ఏరువాక కేంద్రం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. రుద్రవరంలోని వ్యవసాయ పరిశోధనాస్థానానికి కేటాయించిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు ప్రారంభం కాలేదు. దీంతో నిలువనీడలేక శాస్త్రవేత్తలు, కార్యాలయ ఉద్యోగులు పరిపాలనాపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మిగతా 4లో..

రూ. 5 కోట్లతో అంచనాలు

రుద్రవరంలో వ్యవసాయక్షేత్రానికి కేటాయించిన భూమిలో పరిశోధనలు చేయాలంటే ముందస్తుగా పశువులు సంచారాన్ని అరికట్టేందుకు చుట్టూ ప్రహరీ అవసరం. భవనాలు, ల్యాబ్, గోడౌన్, ప్రహరీ నిర్మాణాలకు సంబంధించి ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ అధికారులు రూ.5కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నాలుగేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపారు. ఇంతవరకు ఆమోదానికి నోచుకోలేదు. జిల్లా స్థాయిలో సమావేశాలు జరిగిన ప్రతిసారి ఈ పరిశోధనాస్థానం అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు తమ వంతు కృషి చేస్తామని పాలకులు, అధికారులు చెప్పడం, ఆ తర్వాత ఈ విషయాన్ని మరచిపోవడం రివాజుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.. వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి కేటాయించిన భూమిలోనే గురుకుల జూనియర్ కళాశాలకు వెళ్లే రహదారి, విద్యుత్ లైన్లు, తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయి. వీటిని పక్కకు మార్చాలని చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. ఈ పరిశోధనాస్థానం ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ వ్యవసాయ పరిశోధనాస్థానం నిర్మాణానికి పాలకులు, అధికారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచిచూడాలి.

ఎనికేపాడులో భారీ అగ్నిప్రమాదం

గోడౌన్‌లోని ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ బూడిద

రూ.3 కోట్ల వరకు నష్టం ఉంటుందంటున్న నిర్వాహకులు



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఎలక్ట్రానిక్ వస్తువులు

గుణదల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎనికేపాడులోని ఎలక్ట్రానిక్ వస్తువుల గోడౌన్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రూ.3 కోట్ల వరకు నష్టం సంభవించినట్టు నిర్వాహకులు చెబు తున్నారు. పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంలో సీఅండ్‌ఎఫ్‌ఏ- శ్రీ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఎనికేపాడులో టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఓవెన్లు భారీగా నిల్వ చేసి ఉంచారు. ఇక్కడి నుంచి పలు జిల్లాల్లోని షోరూమ్‌లకు వస్తువులు హోల్‌సేల్‌గా తరలిస్తుంటారు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ గోడౌన్ నుంచి దట్టమైన పొగ వస్తుండటంతో అక్కడే ఉన్న వాచ్‌మెన్.. అగ్నిమాపక, పోలీసులకు సమాచారం అందించాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి ఏడు శకటాలను రప్పించారు. ప్రమాదం సమయంలో సిబ్బంది కానీ, కూలీలు కానీ లేకపోవడంతో ప్రాణ నష్టంమేమీ జరగలేదు. గోడౌన్‌లో నిల్వ ఉన్న సామగ్రిలో 80 శాతం బుడిదయ్యాయి. ప్రమాదం సమయంలో ఏసీలు, రిఫ్రిజరేటర్లలోని గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల పెద్దపెద్ద శబ్దాలు వచ్చాయి. సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘటనకు షార్ట్‌సర్క్యూట్ కారణమా? లేక అగంతకుల పనా? అనే విషయం దర్యాప్తులో తేలుతుందని చెప్పారు. కాగా, నష్టం రూ.3 కోట్ల వరకు ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. నిన్నటి వరకు భవానీలతో నిండిపోయిన ఆలయం వద్ద సోమవారం సాధారణ భక్తుల సందడి కనిపించింది. క్యూలైన్లలో భారీగా తరలివచ్చిన భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అధికారులు పద్ధతి మార్చుకోవాలి
» అర్జీల పరిష్కారంపై కలెక్టర్ బాలాజీ 4

అసెంబ్లీకి గైర్హాజరైతే పారిపోయినట్టే..!
» ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు 4

తొలిరోజు ఆదాయం రూ.3.57 కోట్లు
» దసరా ఉత్సవాల్లో భక్తుల కానుకలు లెక్కింపు 4


దుర్గగుడి మహామండపంలో కానుకలు లెక్కిస్తున్న ఉద్యోగులు

తొలిరోజు ఆదాయం రూ.3.57 కోట్లు

» దసరా ఉత్సవాల్లో భక్తుల కానుకలు లెక్కింపు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీలలో సమర్పించిన కానుకలను ఈవో వీకే శీనానాయక్, దేవస్థానం కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) పర్యవేక్షణలో సోమవారం ఉద్యోగులు, పలు సేవాబృందాలు లెక్కించారు. అధికారులు 50 హుండీలు, 237 బ్యాగ్లలో కానుకలు లెక్కించగా, రూ.3,57,92,708లు ఆదాయం లభించినట్టు ఈవో తెలిపారు. 122 గ్రాముల బంగారు ఆభరణాలు, 9 కేజీల 700 గ్రాముల వెండి ఆభరణాలు భక్తులు అమ్మవారికి సమర్పించినట్టు ఆయన పేర్కొన్నారు. 52 యుఎస్ఏ డాలర్లు, 55 సింగపూర్ డాలర్లు, 130 యుఏఈ దీనార్లు, 5 కెనడా డాలర్లు, 3 సౌదీ రియాల్స్ 7 1/2 కువైట్ దీనార్లు లభించినట్టు ఈవో వివరించారు. మంగళవారం కూడా లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్, వన్టౌన్ పోలీసు సిబ్బంది, దేవదాయశాఖ జిల్లా కార్యనిర్వహణాధికారులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి : ప్రతి పౌర్ణమి నాడు జరిగే గిరిప్రదక్షణ మాసవారీ ఉత్సవం ఈనెల 7న నిర్వహిస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్రోడ్డులోని టోల్ గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్దనుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఘాట్ రోడ్డు అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుంచి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. సకలాభీష్టాలు నెరవేర్చే ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని దుర్గామల్లేశ్వరుల అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

మతదాడులు ప్రమాదకరం

» ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్కుమార్

విజయవాడ లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత్ లాంటి లౌకిక దేశంలో అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్పై కోర్టు వాదనలు జరిగే తరుణంలో ఓ వ్యక్తి దాడికి యత్నించడాన్ని ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇది వ్యక్తిపై దాడి కాదని, న్యాయవ్యవస్థపై దాడి అని చలసాని పేర్కొన్నారు. న్యాయస్థానాలపై దాడులు జరిగే స్థాయిలో మత రాజకీయాలు వుండటం దారుణమని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకోవాలని అజయ్కుమార్ కోరారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

సుప్రీంకోర్టు హాలులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్పై జరిగిన దాడిని ఖండిస్తూ న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్టు బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా తెలిపారు. సోమవారం బార్ అసోసియేషన్లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. న్యాయవాదుల అభిప్రాయం మేరకు మంగళవారం మౌన ప్రదర్శనగా వెళ్లి కలెక్టర్కు వినతిపత్రం సమర్పిస్తారని బాషా తెలిపారు. అనంతరం బందరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'సేవ్ జ్యుడీషియరీ - సేవ్ నేషన్' నినాదంతో ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తి పై దాడి

వన్టౌన్: చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్పై ఓ లాయర్ దాడియత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తిపై దాడి అని ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన తెలిపారు. ఈ దాడియత్నం సంవిధాన విలువలపై, న్యాయవ్యవస్థ గౌరవంపై దాడి అని పేర్కొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అసెంబ్లీకి గైర్హాజరైతే పారిపోయినట్టే..!

» ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుడిగా గెలిచి అసెంబ్లీకి రాకపోతే ప్రజాసమస్యలు పరిష్కరించలేక పారిపోవటమే అని వైసీపీ ఎమ్మెల్యేలనుఉద్దేశించి ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు. పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ బి.సురేష్బాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం చిత్తూరు జిల్లా మదనపల్లెలోని పీకేఎం ఉడా కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యార్లగడ్డ చైర్మన్ సురేష్బాబుకు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, వైసీపీ నుంచి తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ ముఖం చూడకుండానే పదవీకాలం పూర్తవుతుందని బాధపడుతున్నారని, కనీసం పెద్దిరెడ్డి లాంటి సీనియర్లయినా జగన్కు సలహా ఇచ్చి ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపాలని సూచించారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుంటే ప్రజలను, రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. ముఖ్యమంత్రిగా తొమ్మిదేళ్ల పాలనలో ఉమ్మడి రాష్ట్రంలో రూ. 3వేల కోట్ల బడ్జెట్ను రూ.35 వేలకోట్లకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు.కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛా వాయువులు లభించాయన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత

రొమ్ము కేన్సర్ రోగికి కీమోథెరపీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రేడియేషన్ అంకాలజీ విభాగం ద్వారా రొమ్ము కేన్సర్కు మొదటిసారిగా కీమోథెరిపీ ప్రారంభించారు. విజయవాడకు చెందిన ఎన్.విజయరాణికి రొమ్ముకేన్సర్ నిర్ధారణ అయ్యింది. బయాప్సీ చేసి, కీమోథెరపీ ప్రారంభించారు. థర్డ్స్టేజ్లో ఉన్న ఆమెకు చికిత్స చేస్తున్నారు. ప్రస్తుతం కోలుకుంటోంది. సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ, అక్టోబర్ నెలను పింక్ అక్టోబర్గా నిర్ణయించామని, 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. 40 ఏళ్ల లోపు ఉండే మహిళల రొమ్మును ఆల్ట్రా సౌండ్ ద్వారా, 40 ఏళ్ల పైబడిన వారికి మోమోగ్రామ్ చేస్తున్నామన్నారు.

అధికారులు పద్ధతి మార్చుకోవాలి

» అర్జీల పరిష్కారంలో తప్పుడు సమాచారమా!

» ఉదాహరణలతో వివరించిన కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదిక(మీకోసం)కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికారులు తమ పద్ధతిని ఇకనైనా మార్చుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్బాలాజీ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అర్జీల రూపంలో వచ్చిన సమస్యలకు సరైన సమాధానం నమోదు చేయకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. గతంలో వచ్చిన అర్జీలు, అధికారులు రాసిన సమాధానాలను పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కంకిపాడు మండలం కొప్పల్లె, ఉయ్యూరు నుంచి శ్మశాన వాటికలకు స్థలం చూపాలని అర్జీలువస్తే, ఈ సమస్యలను పరిష్కరించకుండా ఆన్లైన్ పోర్టల్లో సిటిజన్ బెనిఫిటెడ్ అని ఎలా నమోదు చేస్తారని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఈ తరహా అర్జీలు మళ్లీ రీఓపెన్ అవుతున్నాయన్నారు. అర్జీలో పేర్కొన్న సమస్య జిల్లాస్థాయిలో కాకుండా రాష్ట్ర పరిధిలో ఉంటే సిటిజన్ ఎట్టు బి బెనిఫిటెడ్ అప్షన్ను నమోదు చేయాల్సి ఉందన్నారు. రహదారుల అభివృద్ధికి అర్జీలు వస్తే సంబంధితశాఖకు అర్జీని పంపామని, సమస్య పరిష్కారమైందని నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారమైనట్టు రాసే సమయంలో చేతిరాత అర్థం కాకుండా కూడా రాస్తున్నారని, ఈ విధానం కూడా మారాలన్నారు.

జిల్లా అధికారులకు అర్థమైతే సరిపోదు

మీకోసం అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టి, సమస్యలను పరిష్కరించాలని పదేపదే చెబుతున్నా జిల్లాస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మండల, గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బందికి ఈ అంశంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడం లేదన్నారు. అర్జీల రూపంలో వచ్చే సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి, సరైన సమాధానం రాసేలా కిందిస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించే బాధ్యత ఆయాశాఖల అధికారులదే అన్నారు. తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. భూమి రికార్డులు, ల్యాండ్సర్వే, రహదారులు తదితర శాఖల్లో ఇంకా పరిష్కారం కాని అర్జీలు ఉన్నాయని, వాటిని నిర్దీత సమయంలోగా పరిష్కరించాలన్నారు.


ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

అర్జీల పరిష్కారంపై తరచూ పరిశీలిస్తా

కలెక్టరేట్లో జేసీ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ ఫర్హీద్జాహిద్, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో కె.స్వాతి, ఏఎస్పీ సత్యనారాయణ తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్జీల పరిష్కారం తీరును ఇకపై తరచూ పరిశీలిస్తానన్నారు. ఆర్టీజీఎస్కు సంబంధించి ఉద్యోగులంతా తమ వివరాలను ప్రత్యేకపోర్టల్లో ఇంకా నమోదుచేయలేదని, త్వరితగతిన ప్రక్రియను పూర్తిచేసేలాఆయా విభాగాల డ్రాయింగ్ ఆఫీసర్లు చొరవ తీసుకోవాలన్నారు. బ్రెస్ట్కేన్సర్పై అవగాహన కల్పిస్తూ వైద్యశాఖ రూపొందించిన, ధాన్యం కొనుగోలు నిబంధనలను వివరిస్తూ పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ కార్యాలయం అధికారులు రూపొందించిన పోస్టర్లను కలెక్టర్, జేసీ, అధికారులు ఆవిష్కరించారు.

ఎస్పీ కార్యాలయంలో..

మచిలీపట్నం క్రైమ్: మీ కోసం ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ వి.విద్యాసాగర్నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 42 ఫిర్యాదులు రాగా.. ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం పోలీసులను ఆశ్రయిస్తారని తెలిపారు. సోమవారం ఫిర్యాదు చేసిన వారిలో అదనపు కట్నం కోసం భర్త వేదింపులకు గురి చేస్తున్నాడని బంటుమిల్లికి చెందిన వనిత, వృద్ధాప్యంలో పిల్లలు పట్టించుకోవటం లేదని కోడూరుకు చెందిన రమణమ్మ, తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమంటే బెదిరింపులకు గురిచేస్తున్నాడని పెనమలూరుకు చెందిన వంశీలు ఉన్నారు. ఫిర్యాదులను త్వరిత గతిన పరిష్కరించాలని ఎస్పీ సూచించారు.

సంతృప్తికర పరిష్కారం చూపాలి


దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై వుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. అర్జీదారులతో సంబంధిత అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండార్స్మెంట్ తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. వ్యవహారశైలి, పరిష్కార విధానం సరిగ్గా లేవన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ రాకూడదని స్పష్టం చేశారు. రీఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సంతృప్త స్థాయిని పెంచాలన్నారు. విజన్ ఆంధ్రప్రదేశ్కు సంబంధించి నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్ క్రియాశీలతకు సమిష్టిగా కృషిచేయాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్తో పాటు కీలక ప్రగతి సూచికలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. అర్జీలన్నింటిని క్షుణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

20 గ్రామాల్లో మూడోదశ రీ సర్వే

» రైతులు సద్వినియోగం చేసుకోవాలి

» ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో 20 గ్రామాల్లో మూడోదశ రీ సర్వే కార్యకలాపాలు ఈనెల 3న ప్రారంభమయ్యాయని, రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సోమవారం తెలిపారు. రైతులు షెడ్యూల్ ప్రకారం రీ సర్వేకు హాజరై తమ సొంత పొలం హద్దులు చూపి సర్వే చేయించుకోవాలన్నారు. జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రీ సర్వే ప్రక్రియను దశలవారీగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తిరువూరు డివిజన్లో రేపూడి గ్రామం (ఎ.కొండూరు మండలం), గోసవీడు (గంపలగూడెం), కొనిజెర్ల (గంపలగూడెం), నరకుల్లపాడు (రెడ్డి గూడెం), మునుకొళ్ల (తిరువూరు), తాటకుంట్ల గ్రామం (విసన్నపేట మండలం)లో రీసర్వే జరుగుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా నందిగామ డివిజన్లో మాగల్లు గ్రామం (నందిగామ మండలం), పున్నవల్లి (చందర్లపాడు), రామచంద్రునిపేట (జగ్గయ్యపేట), మాచినేనిపాలెం (వత్సవాయి), జయంతి (వీరులపాడు), కునికినపాడు (కంచికచర్ల), సైదాపురం (కంచికచర్ల), కొణకంచి గ్రామం (పెనుగంచిప్రోలు మండలం)లో రీసర్వే జరుగుతోందన్నారు. విజయవాడ డివిజన్లో రామవరప్పాడు గ్రామం (విజయవాడ రూరల్ మండలం), ప్రసాదంపాడు (విజయవాడ రూరల్), ఎన్.పోతవరం (ఇబ్రహీంపట్నం), కాచవరం (ఇబ్రహీంపట్నం), మొరుసుమిల్లి (మైలవరం), హెచ్.ముత్యాలంపాడు గ్రామం (జి.కొండూరు మండలం)లో రీ సర్వే ప్రారంభమైందని ఇలక్కియా వెల్లడించారు.

అన్నదాత ఆశల సౌధం వేదాద్రి

» ఎత్తిపోతల పథకానికి తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసిన పవర్ మిక్

» మోటారుకు ట్రయల్ రన్స్ నిర్వహణ

» విద్యుత్ నిలిపివేసి రైతులకు ట్రాన్స్ కో షాక్

» ఎమ్మెల్యే సౌమ్య చొరవతో పునరుద్ధరణ చర్యలు

నందిగామ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత ఆశల సౌధం వేదాద్రి ఎత్తిపోతల పథకానికి తాత్కాలిక మరమ్మతులు పూర్తయ్యాయి. వంద క్యూసెక్కుల నీటిని అందించేందుకు ఒక మోటార్ను సిద్ధం చేశారు. మరమ్మతులు నిర్వహించిన పవర్మిక్ సంస్థ ఇప్పటికే పలుమార్లు ట్రయల్ రన్స్ నిర్వహించింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ పథకం ఆరేళ్లుగా ఆయకట్టు రైతులకు సాగునీరు అందలేదు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్లు శాసనసభలో పలుమార్లు ఈ పథకం గురించి ప్రస్తావించారు. ఎట్టకేలకు ముఖ్యమంత్రి హామీ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ ఎంపీ లాడ్స్ ద్వారా ఒక మోటారు తాత్కాలిక మరమ్మతుకు 33 లక్షలు విడుదల చేశారు. వేదాద్రి పథకంపై ఉన్న రూ.21 కోట్ల బిల్లును రద్దు చేసి.. ఐదేళ్ల వరకూ బిల్లు లేకుండా సరఫరా చేయాలని విద్యుత్శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో అధికారులు సరఫరా పునరుద్ధరించారు. దీంతో పవర్మిక్ సంస్థ పనులు చేపట్టి ఒక మోటార్ను సిద్ధం చేసింది. సుమారు నాలుగు వందల మీటర్ల పొడవైన పైప్లైన్లకు సంస్థ మరమ్మతులు పూర్తి చేసింది. ఎంపీ చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించనున్నారు. రైతులు మంత్రికి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


ట్రయల్ రన్లో నీటిని తోడిపోస్తున్న మోటార్

రైతులకు ట్రాన్స్కో షాక్..

పథకం మరమ్మతులు పూర్తయ్యేవరకూ సరఫరా ఇచ్చిన ట్రాన్స్కో అధికారులు అంతా సిద్ధమైన తర్వాత సరఫరా నిలిపివేసి రైతులకు షాక్ ఇచ్చారు. దీంతో రైతులు, రైతు సంఘాల నేతలు అధికారులను కలవగా, మరమ్మతులు పూర్తయ్యేవరకే సరఫరా ఇవ్వాలన్న ఆదేశాలున్నాయని, ఉన్నతాధికారులు ఆదేశిస్తే తప్ప సరఫరా ఇవ్వలేమని తేల్చిచెప్పారు.

ఎమ్మెల్యే సౌమ్య చొరవతో..

పథకానికి విద్యుత్ సరఫరా నిలిపివేతపై మంత్రిని సంప్రదించేందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రయత్నం చేయగా.. ఆయన విదేశీ పర్యటనలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే విద్యుత్ సంస్థ సీఎండీతో ఫోన్లో మాట్లాడారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరగా స్పందించిన సీఎండీ ఈ విషయం తన దృష్టిలో లేదని.. దీనిపై స్థానిక అధికారులతో సంప్రదించి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు సౌమ్య సాగునీటి సంఘాల ప్రతినిధులకు తెలిపారు. రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వరి పంట రక్షణకు సామూహిక ఎలుకల నివారణ

» రేపు జిల్లావ్యాప్తంగా ప్రారంభం

» పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరి రైతులు తరచుగా ఎదుర్కొంటున్న ఎలుకల సమస్యను నివారించి, పంటను కాపాడటానికి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లావ్యాప్తంగా వరి సాగు చేసే ప్రాంతాల్లో బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ను కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలుకల వల్ల తీవ్ర పంట నష్టం సంభవిస్తోందని, దీనిని నివారించడానికి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. రైతు సేవాకేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల నుంచి బ్రోమోడయోలోన్ ఎలుకల మందును కలిపిన ఎరను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఎలుకలు వున్న బొరియలు గుర్తించి వాటిని మట్టితో కప్పి వుంచాలని, మరుసటి రోజు తెరుచుకొని వున్న బొరియలలో బ్రోమోడయోలోన్ ఎలుకల మందు కలిపిన ఎరను వుంచి మూసివేయాలని తెలిపారు. రైతులంతా సామూహికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని, తద్వారా వరి పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డిప్యూటీ కలెక్టర్ కె.పోశిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ అనిత భాను పాల్గొన్నారు.

టమోత!

(3వ పేజీ తరువాయి)

లక్ష్యాన్ని విస్మరిస్తున్నారు. కడప మార్కెటింగ్ శాఖ డీడీ కొనుగోలు చేసిన టమాటాలను పెద్ద మొత్తంలో చుట్టుపక్కల జిల్లాల రైతు బజార్లకు పంపిణీ చేస్తున్నారు. రోజుకు ఎన్టీఆర్ జిల్లాకు 25 టన్నులు, కృష్ణా జిల్లాకు 10 టన్నులు, ఏలూరు జిల్లాకు 10 టన్నులు, గుంటూరు జిల్లాకు 10 టన్నులు, నెల్లూరు జిల్లాకు 12 టన్నులు. మొత్తం 65 టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల వినియోగదారుడికి కేజీకి రూ.15 పైనే అధిక భారం పడుతోంది. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతు బజార్ల నిర్వచనాన్నే మార్చేశారు. దళారులతో కలిసి పార్టీ నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది. మార్కెటింగ్ శాఖ పని ఏమిటి? ఏ కూరగాయ ధర పెరిగినా సరైన సమీక్ష చేసి, తగు నిర్ణయాలు తీసుకోవాలి. అటు రైతులకు, ఇటు వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. కానీ అలాంటిదేమీ క్షేత్రస్థాయిలో జరగడం లేదు. అంతా అవినీతిమయమైంది. రెండు జిల్లాల యంత్రాంగాలు ఏం చేస్తున్నాయో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు? వాళ్ల కనుసన్నల్లోనే ఈ దోపిడీ జరుగుతోందా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా రాష్ట్ర స్థాయి అధికారులు, విజిలెన్స్ విభాగం ఈ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నాలుగేళ్లుగా నిర్లక్ష్యం

(3వ పేజీ తరువాయి)

సిబ్బంది అయినా వచ్చేవారు. గత రెండేళ్ల నుంచి కార్యాలయ సిబ్బంది కూడా ఎవ్వరూ ఇటువైపు కన్నెత్తి చూడటంలేదు.

నిలిచిపోయిన పరిశోధనలు

రాష్ట్ర వ్యాప్తంగా సముద్రతీర ప్రాంతంలోని చౌడు భూముల్లో అధిక దిగుబడులు వచ్చే వరి వంగడాలను కనుగొనేందుకు మచిలీపట్నంలో వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని 29 ఏళ్ల క్రితం ప్రారంభించారు. ఈ పరిశోధనా స్థానం భూములను మెడికల్ కళాశాలకు కేటాయించడంతో గత నాలుగేళ్లుగా నూతన వరి వంగడాలపై పరిశోధనలు, ప్రయోగాలు నిలిచిపోయాయి. వ్యవసాయ పరిశోధనాస్థానం అభివృద్ధి కోసం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక కమిటీని గతంలో ఏర్పాటు చేసినా ఎలాంటి పురోగతిలేదు. మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనాస్థానం ద్వారా ఎంసీఎం-100, ఎంసీఎం-101 వరి వంగడాలను కనుగొన్నారు. ఆంధ్రప్రదేశ్తో పాటు, ఇతర రాష్ట్రాల్లోని తీర ప్రాంత భూముల్లో ఈ వరి వంగడాలు సాగు చేస్తున్నారు. రుద్రవరంలోని వ్యవసాయ పరిశోధనాస్థానానికి కేటాయించిన భూమిలో 2022 ఖరీఫ్ సీజన్లో 3.50 ఎకరాల విస్తీర్ణంలో దేశ, విదేశాలకు చెందిన మూడు వేల రకాల వరి వంగడాలను ప్రయోగాత్మకంగా సాగుచేశారు. సాగు నీరు సక్రమంగా అందకపోవడం, ఇక్కడి భూమిలో ఉప్పుశాతం అధికంగా ఉండటం, డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో సాగు చేసిన వరి పైరు చనిపోయింది.

భూమిలో 24 చౌడు శాతం

వ్యవసాయ పరిశోధనాస్థానానికి కేటాయించిన 16.34 ఎకరాల భూమి సాగుకు పనికివస్తుందా లేదా అనే అంశంపై శాస్త్రవేత్తలు భూసార పరీక్షలు జరిపారు. ఈ భూమిలో 24 శాతం చౌడు ఉన్నట్లుగా పరీక్షల్లో తేలింది. భూమిలో ఎనిమిది శాతానికి మించి చౌడుశాతం ఉంటే వరిసాగుకు అనుకూలం కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏడాది పాటు వర్షపు నీరు, పంట కాలువ ద్వారా వచ్చే సాగు నీటిని ఈ పొలం మీదుగా నడిపితే కొంత మెరకైనా చౌడుశాతం తగ్గుతుందని శాస్త్రవేత్తల మాటగా ఉంది. ఈ భూమి పల్లపు ప్రాంతంగా ఉండటంతో కనీసం అడుగు ఎత్తున మెరక చేస్తేనే వ్యవసాయానికి అనుకూలంగా మారుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ భూమికి మల్లవోలు ప్రధాన పంట కాలువకు అనుబంధంగా ఉన్న కొత్తిమీర కోడు పంటకాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. కాలువ ద్వారా నీరు పొలానికి అందని స్థితి నెలకొంది.

పక్కా ప్లాన్తోనే వృద్ధురాలి హత్య!

» అవకాశం కోసం చూసి మత్తు పెట్టి..

» పదునైన ఆయుధాలతో ముక్కలు చేసి..

» ఆధారాలు లేకుండా పోలీసులకే సవాల్..


విజయలక్ష్మి (ఫైల్)

విద్యాధరపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భవానీపురంలో కలకలం రేపిన వృద్ధురాలి హత్యను నిందితుడు పక్కా ప్రణాళికతో చేసినట్టు తెలుస్తోంది. హత్య ప్రదేశంలో పోలీసులకు ఎటువంటి ఆధారాలు లేకుండా నిందితుడు జాగ్రత్తపడటమే దీనికి నిదర్శనం. తన భార్య దూరం కావడానికి పిన్ని విజయలక్ష్మి కారణమని కోపంతో రగిలిపోయిన వంకధార హనుమాన్ సుబ్రహ్మణ్యం హత్యకు పథకం రచించాడు. బంధువుల వద్ద తనపై చెడ్డగా ప్రచారం చేస్తుందని సుబ్రహ్మణ్యం కోపంతో రగిలిపోయినట్టు సమాచారం. ఆమెను పథకం ప్రకారం ఇంటికి పిలిపించి రుమాలులో మత్తుమందు చల్లి ముక్కుదగ్గర పెట్టడంతో స్పృహ తప్పి పడిపోయిన తర్వాత విచక్షణా రహితంగా హత్య చేసి, శరీర భాగాలను వేరుచేసి రెండు గోనె సంచుల్లో పెట్టి అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా డ్రైనేజీ కాలువలో పడేశాడు. అనంతరం ఆనవాళ్లు కనపడకుండా ఇంటిలో రక్తం మరకలు శుభ్రం చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి నిందితుడు పక్కా ప్రణాళికతో విజయలక్ష్మిని హత్య చేసినట్టు గుర్తించారు. బొమ్మసానినగర్లో డ్రైనేజీలో పోలీసులకు లభించిన విజయలక్ష్మి మొండెం, నిందితుడు ఇంటిలో కనీసం రక్తం మరకలు లేకపోవటంతో పోలీసులకు సవాల్గా మారింది. మృతురాలి, తల చేతులు, మొండెం, కాళ్లు లభించాయి.

మృతదేహం కుటుంబసభ్యులకు అప్పగింత...

విజయలక్ష్మి మృతదేహానికి భవానీపురం పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఆమె కుటుంబసభ్యులు, బంధువులకు అప్పగించారు. భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి ఒంటిపై ఎటువంటి కత్తిపోట్లు లేవని, కేవలం పదునైన ఆయుధాలతో శరీరాన్ని కోసి వేరుచేసినట్టు తెలిసింది.

ఆధునిక యంత్రాలతో ఆదాయం

» శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్


ఎలక్ట్రిక్ చక్రంపై తయారు చేసిన కుండను బహూకరిస్తున్న కుమ్మరి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : ఆధునిక యంత్రాలను వినియోగించి చేతివృత్తుల వారు ఆదాయాన్ని పెంచుకోవాలని శాలివాహన సంఘం కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ పేర్కొన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర సంచాలకులు ఎస్.గ్రిప్ ఆధ్వర్యంలో గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద మైలవరం మండలం గణపవరం గ్రామంలో ఎలక్ట్రిక్ కుండల తయారీచక్రాల వినియోగంపై సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 15 వరకు తరగతులు కొనసాగనున్నాయి. తొలిరోజు మొత్తం 60మంది వరకు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, వృత్తి నైపుణ్యం పెంచుకునేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. కేవీఐసీ విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్-2 ఆర్.ఎల్.ఎన్.మూర్తి మాట్లాడుతూ, సంప్రదాయ గ్రామీణ చేతి వృత్తుల వారిని గుర్తించి వారి ఆదాయాన్ని పెంచే క్రమంలో శిక్షణనిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వారికి మెరుగైన తయారీ పరికరాలు అందిస్తామన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.శివరామకృష్ణ మాట్లాడుతూ, పదిరోజుల శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకొని తయారీ వస్తువుల ద్వారా గణపవరానికి మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. మాస్టర్ ట్రైనర్ ఎల్లప్ప శాలివాహనులకు అనేక విషయాలపై శిక్షణనిచ్చారు.

మడ అడవులపై కన్ను!

(3వ పేజీ తరువాయి)

నరికివేత పతాకస్థాయికి చేరింది.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రతి వందేళ్లకు ఒకసారి సముద్రపు విపత్తులు సంభవిస్తున్న చరిత్ర బందరు ప్రాంతంలో ఉంది. వందేళ్ల కిందట సముద్రంలో సంభవించిన చమురు పేలుడు కారణంగా ఘంటసాల వరకు సముద్రం ఉప్పొంగింది. ఆ సందర్భంలో 30 వేల మందికి పైగా చనిపోయారు. వీరిలో అప్పటి బ్రిటీషు పాలకులతో పాటు మత్స్యకారులు ఉన్నారు. ఇలాంటి విపత్తులు భవిష్యత్తులో రావని చెప్పలేం.. సునామీలు కూడా వచ్చే అవకాశం లేకపోలేదు. భారీగా సముద్రం ఆటుపోట్లకు గురైనా కూడా తీర ప్రాంతాలు అతలాకుతలం కావాల్సిందే ! ఇలాంటి సందర్భాలలో నష్టాన్ని కొంత మేర నియంత్రించలిగలిగేవి మడ అడవులే. సముద్ర ప్రవాహాన్ని తగ్గించడంలో మడ అడవులు ఎంతగానో దోహదపడతాయి. ఇప్పటికైనా మడ అడవుల సంరక్షణపై కలెక్టర్ బాలాజీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

కుష్టు వ్యాధిగ్రస్తులకు సెల్ఫ్‌కేర్ కిట్‌లు అందజేత



గన్నవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి లెప్రసీ కాలనీలోని కుష్టువ్యాధి గ్రస్తులకు పాదరక్షలు, సెల్ఫ్‌కేర్ కిట్‌లను లెప్రా సొసైటీ ప్రతినిధి మామిడి రాధిక, కుష్టు నివారణ అధికారి నాగరాజు సమక్షంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ప్రతినిధులు సోమవారం అందజేశారు. క్యాన్సర్ రోగి వీసం నాగరాజుకు రూ.5వేలు, పక్షవాతంతో బాధపడుతున్న తాళ్ళపర్తి అమెరికాకు రూ.3వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మానవతా ఛైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షులు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వివి కృష్ణమోహన్, ముక్కామల సుబ్బారావు, పువ్వుల ఆదినారాయణ, వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గంగానమ్మతల్లి ప్రత్యేక పూజలో కమిటీ సభ్యులు

ఘనంగా గంగానమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెరికీడు గంగానమ్మ తల్లి ఆలయ 9వ వార్షిక మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్యామ్ ఆధ్వర్యంలో గంగాన మ్మతల్లికి పుట్టి కోటేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం పరివార దేవతలైన కాలభైరవుడు, పోతురాజులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పంటలు పండి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ మహిళలు పొంగళ్ల నైవేద్యం సమర్పించి అమ్మవారిపూజలో పాల్గొన్నారు. భక్తులకు, ప్రజలు భారీగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు నక్కా బాబు, రాజులపాటి శ్రీనివాసరావు, పల్లపోతు జాన్‌ప్రకాష్, జెట్టి ప్రతాప్ తదితరులు పర్యవేక్షించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న రోటరీ అధ్యక్ష కార్యదర్శులు రవిబాబు, నాగరాజు

పేద విద్యార్థుల అభ్యున్నతికి పుణ్యాచారిటీస్ కృషి

గన్నవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల అభ్యున్నతికి పుణ్యాచారిటీస్ ఎప్పుడు ముందుంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్ష కార్యదర్శి జీవి రవిబాబు, కె.నాగరాజు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ కార్యదర్శి, సీనియర్ రొటేరియన్ జాస్తి విజయ భూషణ్ కుమార్ సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన బీటెక్ చదువుతున్న కందుల నాగ సాత్వికకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లి భాగ్యలక్ష్మీకి అందజేశారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ, చదువులో రాణించే వారికి ప్రోత్సాహకాలు మెండుగా ఉంటాయన్నారు. సమాజ అభి వృద్ధితో పాటు పేద విద్యార్థులకు రోటరీక్లబ్ అండగా ఉంటుందన్నారు. రొటేరియన్‌లు నర్రా సీతా రామారావు, కొల్లి సత్యజగదీశ్వరరావు, జి.సురేష్‌బాబు పాల్గొన్నారు.



వయోజన విద్యపై కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

అక్షరాస్యతపై అవగాహన పెంచాలి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత నిరక్షరాస్యుల్లో చదువు పట్ల అవగాహన పెంచి వారందరినీ అక్షరాస్యులుగా తీర్చి దిద్దడానికి వయోజనవిద్య కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీడీవో కె.జోగేశ్వర రావు అన్నారు. బాపులపాడు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో సోమవారం అక్షరాంధ్ర (ఉల్లాస్) కార్యక్రమంలో భాగంగా వయోజన విద్య కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య ఏపీవో అజయ్‌కుమార్, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు బోధనాంశాలపై కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాం బాలాసింగ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో తాగునీటి కష్టాలు తీర్చండి

ఆటోక్లస్టర్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ఆటోనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో నీటి కష్టాలు తీర్చాలని కోరుతూ ఆటోక్లస్టర్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆటో క్లస్టర్ సర్వసభ్య సమావేశం సోమవారం న్యూ ఆటోనగర్‌లో ఆటోక్లస్టర్ ఎండీ అన్నే శివనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తాగు నీటి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ ఏపీఐఐసీ ఎండీ, వీఎంసీకి వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ తాగునీటి విషయంలో గతంలో వీఎంసీతో ఐలా అవగాహన ఒప్పందం చేసుకుందని, దానిని వారు అమలుచేయడం లేదని ఆరోపిం చారు. ఈవిషయం ఇప్పటికే ఎంపీ, తూర్పు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. సమావేశంలో ఐలా మాజీ ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, బి. బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.





కానూరు- ఏలూరురోడ్డు వైపు రహదారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

అడుగడుగునా అపారిశుధ్యం!

- కానూరు- ఏలూరురోడ్డు వైపు రహదారిలో అపారిశుధ్యం
- కానూరు వంద అడుగుల రోడ్డు నుంచి మహానాడు రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఇబ్బందిపడుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు

(కానూరు-ఆంధ్రజ్యోతి)

కానూరు నుంచి ఏలూరు రోడ్డువైపు వెళ్లే 80 అడుగుల ఆర్ అండ్ బీ రహదారి వెంట అపారిశుధ్యం తాండవిస్తోంది. అదే విధంగా కానూరు వంద అడుగుల రోడ్డు నుంచి మహానాడు రోడ్డు వెంట కానూరు ప్రాంతంలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. ఈ రోడ్ల వెంట భవనాల వ్యర్థాలు, తాగి పడేసిన ఖాళీ కొబ్బరి బోండాల కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. గాలికి చెత్త రోడ్లపైకి వచ్చి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దమొత్తంలో ఈరోడ్లలో చెత్తాచెదారం పేరుకు పోయినా తాడిగడప మున్సిపల్ అధికారులు దృష్టి సారించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కానూరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఈ రోడ్ల వెంట చెత్తావేయాలంటే భయపడేవారని, ట్రాక్టర్ ద్వారా తీసుకువచ్చి ఇక్కడ వ్యర్థాల వేస్తే రూ. 5వేల వరకు పంచాయతీ అధికారులు జరిమానా వేసేవారి వారు అంటున్నారు. అయితే కానూరు తాడిగడప మున్సిపాలిటీలోకి వెళ్లడంతో ఇక్కడ నిఘా కొరవడి ఈ రోడ్లు అపారిశుధ్యానికి కేర్ ఆఫ్‌గా మారాయని గ్రామస్థులు అంటున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి చెత్తను తొలగింపు చేయడంతోపాటు వ్యర్థాలు ఈ రోడ్లు వెంట వేయకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



కానూరు వంద అడుగుల రోడ్డు నుంచి మహానాడు రోడ్డుపైపు పడవేసిన బిల్డింగ్ వేస్ట్, వ్యర్థాలు




సూపర్ జీఎస్టీ పోస్టరును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. రంగన్నగూడెంలో అవగాహన ర్యాలీలో ఆళ్ల గోపాలకృష్ణ

జీఎస్టీ తగ్గింపు సామాన్యులకు వరం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జీఎస్టీ తగ్గింపు సామాన్యులకు వరమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం తాడిగడప మునిసిపాలిటీ పోరంకిలో జరిగిన జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాపార సంస్థల ప్రతినిధులతో కలిసి వినియోగదారులకు ఏవిధంగా సూపర్ జీఎస్టీ ఉపయోగపడుతుందో తెలుసుకొని ప్రజలకు దాని వల్ల ఉపయోగాలను చెప్పించారు. సూపర్ జీఎస్టీ పథకం వల్ల సామాన్య ప్రజలు మందులు, వస్తువులు కొనుగోలు, పచారీ సరుకుల కొనుగోలు చేసి ధరలు తగ్గడంతో సంతోషం, సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా తోడుగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

మర్యాదపూర్వక కలయిక

ప్రభుత్వం నూతనంగా నియమించిన కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. సోమవారం మచిలీపట్నంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మె ల్యే ఎస్పీను దుశ్శాలువాతో సత్కరించి పలు విషయాలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, యేనుగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అందరికీ మేలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో రైతులతో పాటు ప్రజలందరి జీవన ప్రమాణాలు పెరిగి ఆదాయం పెరుగుతుందని ఎస్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, ఏవో రంగనాథ్‌బాబు వేర్వేరు కార్యక్రమాల్లో తెలిపారు. రంగన్నగూడెం, వేలేరులో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ సంస్కరణల ద్వారా నిత్యావసరాలు తగ్గి నెలకు సుమారు రూ.5వేలకుపైగా ఆదా అవుతుదన్నారు. వ్యవసాయ రంగానికి ఊతమి చ్చేలా ట్రాక్టర్ల విడిభాగాలు, డ్రిప్ లాంటి సూక్ష్మసేద్య పరిక రాలపై కేంద్రం 5శాతంకు తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వం మరో 2.5శాతం తగ్గించిందని ఏవో రంగనాథ్‌బాబు తెలిపారు. రంగన్నగూడెం గ్రామానికి చెందిన 24 మంది ఆటోడ్రైవర్లకు రూ.3.60 లక్షల నిధులు వారి ఖాతా ల్లో జమపడగా ప్రభుత్వానికి కృత జ్ఞతలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణారావు, హెచ్‌ఓ జోసఫ్, రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ ఛైర్పర్సన్ అవిర్నేని భవానిశంకర్, కనకవల్లి శేషగి రిరావు, కలపాల రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



బెస్ట్ అవార్డు అందుకుంటున్న సర్పంచ్ లక్ష్మీమౌనిక, కార్యదర్శి ప్రసాద్

కేసరపల్లి పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు

గన్నవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి పంచాయతీకి జిల్లాస్థాయి బెస్ట్ అవార్డు వచ్చింది. సోమవారం మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ చేతుల మీదుగా బెస్ట్ అవార్డును సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, కార్యదర్శి సీవీఎల్ఎస్ఆర్‌వి ప్రసాద్ అందుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గ్రామాన్ని శుభ్రంగా తీర్చిదిద్దడంతో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛసేవ అవార్డుకు ఎంపికైంది. అవార్డు అందుకున్న వారు మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో బెస్ట్ అవార్డు అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతోనే అవార్డు లభించిందని, స్వచ్ఛగ్రామంగా తీర్చిదిద్దేందుకు మరింత కృషి చేస్తామని తెలిపారు.

ఏసుబాబుకు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డు

ఉయ్యూరు : కాటూరు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కొక్కిలిగడ్డ ఏసుబాబు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డు అందు కున్నారు. మచిలీపట్నం జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాశ్, కలెక్టర్ డీకే బాలాజీ, కొనకళ్ల నారాయణ నుంచి అవార్డు అందుకున్నారు. ఎంపీడీవో శేషగిరిరావు తదితరులు ఏసుబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న కొక్కిలిగడ్డ ఏసుబాబు



ఎస్‌జీఎఫ్ మండల బాలికల వాలీబాల్ జట్టు

ఎస్‌జీఎఫ్ మండలస్థాయి జట్ల ఎంపిక

ఉయ్యూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉయ్యూరు మండలస్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఎంఈఓ-2 దుర్గాసాగర్ ముఖ్య అతిథిగా హాజరై సెలక్షన్స్ ప్రారంభించారు. అండర్-17 బాలుర వాలీబాల్ టీమ్‌కు జి.చాణక్య, పి.సృజన్, టి.ప్రమోద్, వి.కల్యాణ్, వి.హరిభాస్కర్, బి.కిరణ్, పి. అభిరామ్, కె.మరియదాస్, ఎం. యశ్వంత్, జి.సుదర్శన్, డి. జయప్రకాశ్, టి.సుశాంత్, ఎంపికకాగా స్టాండ్‌బైగా ఎం.తివిక్రమ్, ఎస్. అజయ్‌కుమార్, బి.యువరాజు ఎంపికయ్యారు. అండర్- 17 బాలికల జట్టుకు జి.గీతశ్రీ, కె.సైలు, ఆర్.లాస్య, టి.హారిక, పి.ఖ తేజ, బి.నవీనశ్రీ, ఎండి సన, బి.భాను, ఆర్. జెస్సిక ఎంపికయ్యారు. ● అండర్-14 బాలుర జట్టుకు బి.సాత్విక్, జి.సుజన్, పి.కరీమ్‌ఖాన్, డి.మహిధర్, డి.రాజేశ్, డి.రవికుమార్, ఇ.భార్గవ్ టి.ప్రణీత్, బి.దీపక్, బి.ధనుష్, కె.అభి ఎంపికయ్యారు. ● అండర్ 14 బాలకల జట్టుకు జి.విద్యనాగదుర్గ, ఎస్‌కె. గౌరిమ, కె.దివ్యశ్రీ, ఎస్‌కె. షర్మానా, ఎన్.భార్గవి, ఆర్.సుష్మ, లక్ష్మీసామ్రాజ్యం ఎంపికయ్యారు. ఉయ్యూరు హెచ్‌ఎం టి. వెంకటనాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సాయి, మండల ఎస్‌జీఎఫ్ కో-ఆర్డినేటర్ కె. బాలస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాపులపాడు హైస్కూల్‌లో క్రీడాపోటీలు



హనుమాన్‌జంక్షన్: బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో మంగళ, బుధవారాల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటల పోటీ లు నిర్వహిస్తున్నట్లు మండల క్రీడా ఇన్‌చార్జి బి.ఎస్. రామచంద్రుడు తెలిపారు. సోమవారం హెచ్‌ఎం శ్రీనివాస్‌తో కలిసి ఆటల పోటీల ఏర్పాట్లను పరిశీలించి సమీక్ష నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బాలబాలికలకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో పోటీలు నిర్వహించి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

పెనమలూరు సర్పంచిగా భాస్కరరావును

కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు

పెనమలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నీటి పారుదల శాఖ అనుమతులు లేకుండానే వారి స్థలంలో రోడ్డు వేసి లక్షల రూపాయల ప్రజాధనం వృధా చేశారనే ఆరోపణలపై సస్పెండయిన పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావును తిరిగి ఆపదవిలో కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెండై మూడు నెలలు దాటినా తాను పదవిలో కొనసాగడానికి అధికారులు ఉత్తర్వులు ఇవ్వలేదని, తన హక్కులకు భంగం వాటిల్లుతోందంటూ ఇటీవల సర్పంచి భాస్కరరావు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు లింగాల భాస్కరరావును తిరిగి సర్పంచిగా విధులు కొనసాగనివ్వాలని, అతనిపై వచ్చిన ఆరోపణలను నాలుగు వారాల్లోగా విచారించి తగుచర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు గత నెల 25న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

● ఎన్‌హెచ్ అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వినతి

విజయవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలతో అనేక మంది మృత్యువాత పడుతున్నారని, తక్షణమే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సంబంధిత అధికారులను కోరారు. సోమవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలుపుతూ, కొన్ని రోజులుగా గన్నవరం నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడంపై యార్లగడ్డ ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారిపై రామవరప్పాడు నుంచి బాపులపాడు మండలం బొమ్ములూరు వరకు ఎలక్ట్రికల్ స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. క్షతగాత్రులకు అత్యవసర చికిత్స అందించడానికి కనీసం రెండు లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆయన కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు సత్వరమే ఉచితంగా అత్యాధునిక వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు యార్లగడ్డ పేర్కొన్నారు.

ఆరోగ్యానికి కూటమి పెద్దపీట

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)నుంచి మంజూరైన రూ.11లక్షల 25వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్వయంగా లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. అందువల్ల రాష్ట్రంలోని ప్రతిఒక్క పౌరుడు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభు త్వపరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన మొదటిరోజు నుంచి సీఎంఆర్ఎఫ్‌ను అమలుచేస్తున్నారని తెలిపారు.



సీఎం చంద్రబాబు నుంచి అవార్డును స్వీకరిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, కృష్ణలంక వీఎంఆర్ఆర్ (జీ) వీఎంసీ హైస్కూల్ హెడ్ మాస్టర్ మృణ్మయి, డీఈవో యూవీ సుబ్బారావు, హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎన్ రాజా, డీఎంహెచ్‌వో సుహాసిని, అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఏడీ డాక్టర్ వై శేఖర్, డాక్టర్ రత్న ప్రియదర్శిని, దావాజీగూడెం బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పీ లక్ష్మి, జిల్లా అధికారి జీ రమేశ్, కేదారేశ్వరపేట-3 అంగన్‌వాడీ ఎస్‌కే ఆసియా బేగం, పీఎన్‌బీఎస్ డీపీటీవో ఎంవై దానం, రైజ్ డైరెక్టర్ యశస్విని పెద్ది, కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జీ సుబ్బారావు, ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్

స్వచ్ఛతకు పురస్కారాల పట్టం

- భారీ పరిశ్రమల కేటగిరీలో విజయా డెయిరీ ప్రాజెక్టు కామధేను ప్లాంట్ (వీరవల్లి)
- అవార్డు స్వీకరించిన చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి శ్రీధర్‌బాబు
- స్వచ్ఛ సర్వేక్షణ్ (కార్పొరేషన్) అవార్డును స్వీకరించిన కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర
- స్వచ్ఛ బస్‌స్టేషన్ అవార్డును స్వీకరించిన ఆర్టీసీ ఈడీ విజయరత్నం, ఆర్ఎం ఎంవై దానం
- స్వచ్ఛ అంగన్వాడీ, యూపీహెచ్‌సీ తదితర మొత్తం 8 అవార్డులు అందుకున్న ఎన్టీఆర్ జిల్లా

ఆంధ్రజ్యోతి, కలెక్టరేట్/కార్పొరేషన్: 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' లక్ష్యసాధనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థలు, వ్యక్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సోమవారం అవార్డులను స్వీకరించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో మెగా/భారీ పరిశ్రమల కేటగిరిలో 'బెస్ట్ స్వచ్ఛ ఇండస్ట్రీ'గా మొదటి ర్యాంకు సాధించిన కృష్ణా మిల్క్ యూనియన్ ప్రాజెక్ట్ కామధేను ప్లాంట్ (వీరవల్లి)కి అవార్డు వరించింది. ఈ అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు సంయుక్తంగా అందుకున్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ నేతృత్వంలో పరిశుభ్రమైన వాతావరణంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పాలు, పాల పదార్థాలను వినయోగదారులకు అందించటం జరుగుతోంది. దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధర, క్రమం తప్పకుండా బోనస్ అందించటంతో పాటు, పాడి రైతులు, పశు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్‌కు ఈ అవార్డు లభించటం విశేషం.

సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న విజేతలు

పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు- 2025లో ఎన్టీఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించగా సోమవారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛాంధ్ర పురస్కారాలను విజేతలకు అందజేశారు. మొత్తం 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్టీఆర్ జిల్లాకు లభించాయి. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ్ సర్వేక్షణ్)ల్లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ తరఫున కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర సంయుక్తంగా అందుకున్నారు. స్వచ్ఛ బస్‌స్టేషన్ల విభాగంలో విజయవాడ పీఎన్‌బీఎస్ తరఫున ఆర్టీసీ ఈడీ విజయారత్నం, ఆర్ఎం ఎంవై దానం అవార్డు అందుకున్నారు. తర్వాత స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, స్వచ్ఛ అంగన్వాడీలు విభాగంలో కేదారేశ్వర పేట - 3 అంగన్వాడీ కేంద్రం, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణలంకలోని వీఎంఆర్ఆర్ (జీ) మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ అవార్డులు సాధించగా ఆయా సంస్థలు, పాలనా యూనిట్ల ప్రతినిధులు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులతో పాటు అభినందనలు అందుకున్నారు.

టీమ్ ఎన్టీఆర్ విజేతలకు కలెక్టర్ అభినందన

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనకు ముందడుగు వేస్తూ స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్‌టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలిపినందుకు అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారాల స్ఫూర్తిగా జిల్లాను మరింత స్వచ్ఛత దిశగా నడిపించాలన్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతలో చేసిన విశేష కృషిని గుర్తించేందుకు ఈ అవార్డులు దోహదపడతాయన్నారు. స్వచ్ఛాంధ్ర మిషన్‌లో కీలకపాత్ర పోషించేలా ప్రోత్సహించేందుకు, సంస్థలు, పాలనా యూనిట్ల మధ్య ఆరోగ్యకర పోటీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భరోసానిచ్చినట్టు తెలిపారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతలో అత్యుత్తమ విధానాలు, ఆవిష్కరణల ప్రదర్శనకు, స్వచ్ఛాంధ్రలో ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు దోహదం చేస్తాయన్నారు.



సీఆర్డీఏ కార్యాలయం వద్ద అధికారులతో ఏడీసీ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ పార్థసారథి

సీఆర్డీఏ భవనానికి హంగులు

- ఏడాది పొడవునా పూసే పూలమొక్కలతో ముస్తాబు

విజయవాడ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఆర్డీఏ కొత్త భవనం రంగుల హంగులతో ముస్తాబవుతోంది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి ఆదేశాల మేరకు సీఆర్డీఏ భవనం ఎదుట ఆకర్షణీయమైన, ఏడాది పొడవునా పూసే పూల మొక్కలను అధికారులు ఏర్పాటుచేయనున్నారు. వెంకటపాలెం నర్సరీలోని ఏడీసీ నర్సరీలో ప్రత్యేకంగా పెంచుతున్న మొక్కలను ఇక్కడ ప్లాంటేషన్ చేస్తున్నారు. శీతల దేశాల్లో ఎక్కువగా కనిపించే టబూబియా అర్జెంషియా, అవలాండా, కాస్సియా పిస్టులా, మిల్లింగ్ టోనియా, కాస్సియా జవానికా, ఫ్లుయేరియా వంటి విలువైన మొక్కలు తెలుపు, గులాబీ, పసుపు రంగుల్లో పూలు పూస్తాయి. వీటిని సీఆర్డీఏ భవనం ఎదుట, పరిసర ప్రాంతాల్లో సుమారు 300 మొక్కల ఏర్పాటుకు ఏడీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక్కడ చేపడుతున్న పచ్చదనం అభివృద్ధి పనులకు ఏడీసీ నర్సరీ మొక్కలు కావడంతో కేవలం రూ.16 లక్షలు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. సీఆర్డీఏ పార్కింగ్, వీఐపీ పార్కింగ్, క్యారిడార్ల వెంట కనువిందు చేసేలా గ్రీన్‌లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రభుత్వ సాగతీత ధోరణి సరికాదు

- పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు దాలినాయుడు

విజయవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు, సమస్యల గురించి జేఏసీ చర్చల విషయంలో ప్రభుత్వం సాగతీత ధోరణి అవలంబిస్తోందని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కే దాలినాయుడు అన్నారు. నగరంలోని పెన్షనర్ల భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలస్యంగానైనా ప్రభుత్వం పెన్షనర్ల డిమాండ్లు తీరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసోషియేషన్‌ను పటిష్ఠం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గతవారం మృతిచెందిన ఈ కార్యాలయ సభ్యుడు, పెనమలూరు మాజీ ట్రెజరర్ ఐనంపూడి సాంబశివరావుకు శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జీ నారాయణ రావు, జనరల్ సెక్రటరీ బీ విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న పీహెచ్‌సీ వైద్యులు

కొనసాగిన పీహెచ్‌సీ వైద్యుల నిరాహారదీక్ష

ధర్నాచౌక్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన నిరాహారదీక్ష 2వ రోజు సోమవారం కొనసాగింది. జీవో 99ను తక్షణమే రద్దు చేయాలని, ట్రైబల్ అలవెన్స్ చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్ కల్పించాలని, టైమ్‌బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని నినదించారు. మూడేళ్లుగా గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్న వైద్యులకు రూ.5 వేల టీఏ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే గ్రీవెన్స్, కన్సల్టేషన్, ప్లానింగ్ చర్చల్లో ఇతర వైద్య సంఘాలతో మాదిరిగా తమ సంఘానికి అవకాశం కల్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రవీంద్ర, డాక్టర్ కిషోర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాహుల్, కోశాధికారి డాక్టర్ వినోద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్ఞానేష్ పాల్గొన్నారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక రైలులో యాత్ర

రైల్వేస్టేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర నవంబరులో ప్రారంభిస్తున్నట్టు భారతీయ రైల్వేస్ భారత్ గౌరవ ట్రైన్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. విజయవాడ బెంజిసర్కిల్‌లోని హోటల్ ఐరాలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలులో తమిళనాడు, కేరళలోని దేవాలయాలు, పంచ ద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాలు దర్శించుకునే అవకాశం ఉందన్నారు. నవంబరు 16, 26న రైలు బయలుదేరుతుందన్నారు. ఇండియన్ రైల్వే, మొదటి భారత్ గౌరవ్ రైలు, సౌత్ స్టార్ రైల్, అతి పెద్ద టూరిస్ట్ రైలు ఆపరేటర్ టూర్ టైమ్స్ ఈయాత్ర చేపట్టిందన్నారు. రిజర్వేషన్ల కోసం టూర్ టైమ్స్‌ను నేరుగా 9355021516 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లోనూ బుక్ చేసుకోవచ్చన్నారు. అందుకోసం టూర్ టైమ్స్ ఇన్‌వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. తమిళనాడు, కేరళ దేవాలయాల యాత్ర నవంబరు 16న పంచ ద్వారక, మహాదేవ్, జ్యోతిర్లింగాల యాత్ర నవంబర 26న ప్రారంభం కానుందన్నారు. ఈ ప్రత్యేక రైలులో ఒక ఫస్ట్ ఏసీ, 3 సెకండ్ ఏసీ, 5 థర్డ్ ఏసీ, 2 స్లీపర్, ఒక ప్యాంట్రీ కార్ ఉంటాయన్నారు. ఈ రైలు 650 మంది ప్రయాణికులు సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఈ ప్యాకేజీలో వసతి, సందర్శన, బస్సు, ట్రావెల్ ఇన్సూరెన్స్ మూడు పూటలా భోజనం, యాత్రికులు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యాన్ని పొందవచ్చన్నారు.

గర్భిణులకు ఎనీమియా

70 శాతం మందిలో మైల్డ్ ఎనీమియా



- గర్భిణులను వేధిస్తున్న ఎనీమియా
- పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి
- జాగ్రత్తలతో సమస్య నుంచి బయటపడే అవకాశం

జిల్లావ్యాప్తంగా ఐరన్ లోపంతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గైనకాలజీ వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఐరన్ లోపంతో బాధపడే గర్భిణుల్లో సివియర్ ఎనీమియా, మైల్డ్ ఎనీమియా రెండు రకాలు ఉంటారు. సాధారంగా 70 శాతం గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఆంధ్రజ్యోతి - విజయవాడ: జీజీహెచ్‌లో ప్రతి నెలా సగటున 500 పైగా ప్రసవాలు జరుగుతాయి. వీరిలో 80-90 మంది గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. 12 శాతం మందిలో మాత్ర మే సాధారణ స్థాయి కంటే అధికంగా హి మోగ్లోబిన్ ఉంటోందని వైద్యులు తెలిపారు. 3-4 శాతం మంది సివియర్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు.

రక్త హీనత నిర్ధారించేలా..

హిమోగ్లోబిన్ పరీక్ష ద్వారా రక్తహీనతను నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ 11 గ్రాములుంటే సమస్య లేనట్టు. అంతకంటే తక్కువగా ఉంటే రక్తహీనతతో బాధపడుతున్నట్టు గ్రహించాలి. సివియర్ ఎనీమియాతో బాధపడే గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం 7 గ్రాముల కంటే తక్కువే. ఇది అత్యంత ఇబ్బందికరమైనది. ఈ సమస్య ఎక్కువగా గ్రామీణ మహిళల్లో కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఈతరం గర్భిణుల్లో హిమోగ్లోబిన్ 7 నుంచి 9 గ్రాముల మధ్య ఉంటోంది. దీనినే మైల్డ్ ఎనీమియాగా వైద్యులు చెబుతున్నారు. 65-70 శాతం మంది గర్భిణులు ఈ సమస్యతో బాధపడుతున్నారు. గర్భం దాల్చిన తర్వాత తగిన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల మైల్డ్ ఎనీమియాతో ఉన్న గర్భిణులు సివియర్ ఎనీమియా స్థాయికి దిగజారుతారని వైద్యులు చెబుతున్నారు.

ప్రధాన కారణం

రక్తహీనత బారినపడడానికి ప్రధాన కారణం పోషకాహార లోపమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏ, బీ12, బీ2, సీ, డీ, ఈ విటమిన్లు, రాగి, జింక్ లోపంతో రక్తహీనత బారినపడుతున్నారు. దీనివల్ల గర్భిణుల్లో తీవ్రమైన అలసట, కళ్లు పాలిపోవడం, ఆయాసం, గుండెదడ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ముందు జాగ్రత్తలు అవసరం



గర్భిణుల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పోషకాహారం తీసుకోకపోవడం, చిన్న వయసులోనే పెళ్లిళ్ల వల్ల ఈ సమస్య పెరుగుతోంది. ప్రతి 10 మంది గర్భిణుల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్న వారే. వీరికి తగిన మందులతో పాటు డైట్‌ప్లాన్ చెబుతున్నాం. ప్రసవ సమయంలో క్లిష్ట పరిస్థితులు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా గర్భంతో ఉన్న సమయంలో ఫాస్ట్‌ఫుడ్, బయట ఆహారం జోలికి వెళ్లకపోవడం మంచిది.

డాక్టర్ కేశవచంద్ర,
గైనకాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్

సమస్యలు

పుట్టబోయే బిడ్డ బరువు, పెరుగుదల తక్కువగా ఉంటుంది. హిమోగ్లోబిన్ 7 గ్రాముల కంటే తక్కువగా ఉన్న గర్భిణులకు ప్రసవ మరణాల్లో ఇన్‌డైరెక్ట్ కారణాల్లో ఇదొకటని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలోని ప్రతి లక్ష ప్రసవాల్లో 60 మంది ఈ కారణంగానే మృత్యువాత పడుతున్నారు.

ఆ వయసే కీలకం

గర్భిణుల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించడానికి ముందస్తు చర్యలే మార్గమని చెబుతున్నారు. ముఖ్యంగా 10-19 ఏళ్లలోపు వయసున్న బాలికల్లో రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలి. అవసరమైన పోషకాహారం, మందులతో వివాహ సమయానికి కోలుకుంటారని, తద్వారా సమస్యకు శాశ్వతంగా పరిష్కరించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

పోషకాహారంతో మేలు

పోషకాహారం ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ పెట్టవచ్చు. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు, మాంసం, డ్రైఫ్రూట్స్, పండ్లు తీసుకోవాలి. నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలు బెల్లం చిక్కీలు వంటివి రోజూ తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికారని చెబుతున్నారు. చాలా మందికి పోషకాహారం తీసుకునేందుకు అవకాశమున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ సమస్య ఎదురవుతోందని నిపుణులు చెబుతున్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి గర్హనీయం

- ఐలూ నేతలు సుంకర, నల్లూరి ఖండన



విజయవాడ లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రయత్నం న్యాయవ్యవస్థపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో అభివర్ణించా రు. రాజ్యాంగాన్ని రక్షించడంలోనూ, నిర్దేశించిన మౌలిక సూత్రాల్లో ఒకటైన భౌతికతత్వాన్ని రక్షించడంలోనూ ఆయన ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. రాజ్యాంగం కంటే సనాతన ధర్మమే గొప్పదని ప్రచారం చేసి ప్రజల మధ్య చిచ్చుపెట్టి, మత విభజనను, మత విద్వేషాన్ని రేపుతున్న సంస్థలు, పాలకుల తీరువల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సుంకర, నల్లూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) తీవ్రంగా ఖండిస్తోందని, దాడిచేసిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌కు రక్షణ మరింత పెంచాలని, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలని ఐలూ తరఫున భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు రాజేంద్రప్రసాద్, మాధవరావు తెలిపారు.

లోకో పైలెట్ మనీషాకు పల్లా అభినందన



రైల్వేస్టేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లికి చెందిన వందే భారత్ రైలు లోకో పైలెట్ గుంటి మనీషా సోమవారం ఆయ న కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయన మనీషాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆ మె లోకో పైలెట్ కావాలనే ఆసక్తిపై వివరాలు, కుటుంబ నేపథ్యం గురించి, ప్రస్తుతం ఆమె ఏ రైల్వే డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. తనకు చిన్నతనం నుంచి డ్రైవర్ కావాలనే ఆకాంక్ష ఉండేదని, అనుకోని పరిస్థితుల్లో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి చనిపోవటంతో సోదరి ప్రోత్సాహంతో ఐటీఐ చదివి, ఆర్ఆర్‌బీ పరీక్షలో పాసై, లోకో పైలెట్ అయినట్టు వివరించారు. ప్రస్తుతం బెంగళూరు డివిజన్‌లో వందే భారత్ రైలు లోకో పైలట్‌గా పనిచేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. కాగా, ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో మనీషా గురించి వందే... మనీషా! కథనం ప్రచురితమైంది. ఆమె గురించి తెలుసుకున్న శ్రీనివాసరావు తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు.

డబ్బులిస్తే గౌరవ డాక్టరేట్లు..!

తెనాలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలతో సంబంధం లేకుండా, వైస్ చాన్స్‌లర్ల సంతకాలు లేకుండా.. నకిలీ డాక్టరేట్ సర్టిఫికెట్లు జారీచేస్తున్న తెనాలి వాసిని తెలంగాణ పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని దుగ్గిరాల కేంద్రంగా పెద్దేటి యోహాను అనే వ్యక్తి 'గుర్రం జాషువా స్మారక కళా పరిషత్' పేరుతో సాహిత్య, ఇతర రంగాల్లో విశేష కృషి చేసిన వారికి పురస్కారాలిస్తూ వచ్చాడు. తనకు ఐఎస్‌వో గుర్తింపు ఉందంటూ స్వయంగా గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేయడం మొదలు పెట్టాడు. దీనికోసం ఒక్కో డాక్టరేట్‌కు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నట్టు తెలిసింది.

తప్పిన ఘోర ప్రమాదం

- హనుమాన్‌పేటలో పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ లీకై స్వల్పంగా దగ్ధమైన ట్యాంకర్
- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది
- ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలు

వన్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ హనుమాన్‌పేట పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో సోమవారం సాయంత్రం పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ లీకేజీ కావటంతో మంటలు చెలరేగాయి. డ్రైవర్ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించటంతో స్వల్పంగా మంటలు అంటుకోగా తప్పించుకుని పరిగెత్తాడు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు తెలియజేయటంతో ఫైర్ ఆఫీసర్, సిబ్బంది సకాలంలో స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కొండపల్లి ఐవోసీఎల్ ప్లాంట్ నుంచి ఏపీ 39 టీజీ 4565 నెంబరు గల ట్యాంకర్ డ్రైవర్ 15వేల లీటర్ల పెట్రోల్, 5వేల లీటర్ల డీజిల్ నింపుకుని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఐవోసీఎల్ బంక్‌కు వెళ్లటానికి సోమవారం మధ్యాహ్నం బయలుదేరాడు. పాయకాపురంలోని ఐసీఎల్ పెట్రోల్ బంక్‌లో ట్యాంకర్‌కు పెట్రోల్ నింపుకుని బుడమేరు వంతెన, అయోధ్యనగర్, గాంధీనగర్, హనుమాన్‌పేట మీదుగా బస్టాండ్ పక్కనుంచి కృష్ణలంక వారధి పైకి వెళ్లేందుకు బయలుదేరాడు. హనుమాన్ పేట పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీకవటంతో వాసన గమనించిన డ్రైవర్ కోటేశ్వరరావు రోడ్డు పక్కన ట్యాంకర్‌ను ఆపి వాహనంలోని సేఫ్టీ పరికరాల ద్వారా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు. మంటలు ఎగబాకటంతో భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం తెలిపారు. డీఎఫ్‌వో ఏవీ శంకర్‌రావు తమ సిబ్బందితో పాటు రెండు ఫైర్ వాహనాల్లో వెళ్లి మంటలను ఆర్పివేశారు.



రోడ్డులో కాలిపోతున్న పెట్రోల్, డీజిల్ ట్యాంకర్, (ఇన్‌సెట్లో) మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

అనంతరం సంఘటనా వివరాలను డ్రైవర్ కోటేశ్వరరావు నుంచి అడిగి తెలుసుకున్నారు. మరోపక్క గవర్నర్‌పేట పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి డ్రైవర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. డీఎఫ్‌వో శంకర్‌రావు ఐవోసీ అధికారులు, ట్యాంకర్ ఓనర్ ఫోన్ నెంబర్లు తీసుకుని మాట్లాడారు. డ్రైవర్‌కు స్వల్పంగా కాళ్లకు గాయాలవగా, తల వెంట్రుకలు కొద్ది మొత్తంలో కాలాయి. ట్యాంకర్ రెండు టైర్లు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది, పోలీసులు హనుమాన్ పేట రోడ్డులో రాకపోకలను నిలిపేశారు. జి.కొండూరుకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ తాతా కోటేశ్వరరావు కొండపల్లికి చెందిన ట్యాంకర్ల వ్యాపారి వద్ద కొన్నేళ్లుగా పనిచేస్తున్నట్టు తెలిసింది.



ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం

అమరావతిలో పర్యటన

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బృందం సోమవారం రాజధాని అమరావతి పర్యటనకు విచ్చేసింది. ఏడీబీ - వాటర్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో (సీనియర్ డైరక్టర్), మనోజ్ శర్మ (డైరెక్టర్), సంజయ్ జోషి (ప్రిన్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ (సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్) తొలుత విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చారు. ఏడీబీ బృందానికి సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు, అదనపు కమిషనర్లు జీ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, అమిలినేని భార్గవ్‌తేజ్ స్వాగతం పలికారు. అనంతరం సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)లోని ముఖ్య అధికారులతో బ్యాంకు బృందం సమావేశం కాగా రాజధాని అమరావతి నిర్మాణ పురోగతిని కమిషనర్ వివరించారు. అలాగే సమావేశంలో బ్యాంకు ప్రతినిధులు పలు అంశాలపై అధికారులతో చర్చించారు. అమరావతి నిర్మాణంలో రైతుల సహకారం, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అనుసరించి పనులు జరుగుతున్న క్రమాన్ని బ్యాంకు బృందానికి వివరించారు. రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో అమలు చేస్తున్న పర్యావరణ, సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, అమరావతిలో సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పన గురించి వివరించారు. కార్మికుల సంక్షేమానికి పాటిస్తున్న విధానాలను వివరించారు. అనంతరం బ్యాంకు బృందం మందడంలోని సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, శాఖమూరు రిజర్వాయర్, నిర్మాణం పూర్తి చేసుకొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల సముదాయాలు, గెజిటెడ్ అధికారుల భవనాలు, అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్సు (ఏజీసీ)లో శాసనసభ, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ ప్రాంతాలు, ఎన్-9 రహదారి నిర్మాణ పనులు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యుటీపీ) నిర్మించే ప్రాంతాలను, అలాగే ప్రస్తుత హైకోర్టు భవనాన్ని బ్యాంకు బృందం పరిశీలించింది. ఆయా సైట్లలో సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. మందడంలో అమలుచేస్తున్న గ్రీవెన్స్ రిడ్రస్సల్ మెకానిజం (జీఆర్ఎం) గురించి అధికారులు బ్యాంకు బృందానికి వివరించారు. అర్జీల పరిష్కారంలో అమలవుతున్న జీఆర్ఎం విధానంపై బ్యాంకు బృందంలోని సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శాఖమూరు రిజర్వాయర్ వద్ద ఏడీసీఎల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ (పీఎంసీ), గుత్తేదారులతో బ్యాంకు బృందంలోని సభ్యులు కలిశారు. బ్యాంకు బృందానికి అధికారులు నిర్మాణ పనుల పురోగతిని తెలియజేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

మందుగుండు దుకాణాల్లో తనిఖీలు

గుడివాడ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేసే వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. సోమవారం బొమ్ములూరు, మల్లాయిపాలెంలోని మందుగుండు సామగ్రి షాపులను తనిఖీ చేశారు. నేల టపాసులు చేసే 20 మందిపై ఒక్కొక్కరికి రూ.లక్ష పూచీకత్తు మీద బైండోవర్ కేసు నమోదు చేసి మండల మేజిస్ట్రేట్ కిరణ్ దగ్గర హాజరుపర్చినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తే ఊపేక్షించమని తెలిపారు. మందుగుండు తయారు చేస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే తెలియజేయాలని కోరారు.



మందుగుండు షాపులను తనిఖీ చేస్తున్న ఎస్సై చంటి బాబు



సీఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్న ఎస్టేట్ ఆఫీసర్ చంద్రమోహన్‌రావు

కూచిపూడి ఎస్టేట్ అధికారి చంద్రమోహన్‌రావుకు స్వచ్ఛాంధ్ర అవార్డు

కూచిపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కూచిపూడిలో రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైన రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కె.చంద్రమోహనరావు సోమవారం రాత్రి సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ద్వారా శాలువా, ప్రశంసాపత్రాన్ని ఆయనకు బహూకరించారు. రైతు బజార్ సీఈవో మాధవీలత, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, స్వచ్ఛాంధ్ర నిర్వాహకులు పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

మెగా కంపెనీ చైర్మన్ కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

పామర్రు: దేశంలో అనేక ప్రాజెక్టు నిర్మాణాల్లో ప్రసిద్ధిగాంచిన మెగా ఇంజనీరింగ్ సంస్థ చైర్మన్ పి కృష్ణారెడ్డి మాతృమూర్తి విజయలక్ష్మి మృతి దిగ్భ్రాంతి కలిగిందని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. డోకిపర్రులో కృష్ణారెడ్డి ఇంటి వద్ద సోమవారం వెళ్లి విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. కృష్ణారెడ్డికుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

వంటసామగ్రి అందజేత

గుడివాడ : స్థానిక నీలామహల్ రోడ్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల(అల్లంబడి)లోని అంగన్వాడీ కేంద్రానికి సోమవారం వలవల పెద్దిరాజులు జ్ఞాపకార్థం వారి కుమారులు సురేంద్రకుమార్, నరేష్‌ల సహకారంతో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో వంట పాత్రలను అందజేశారు. పుట్టి హరికుమార్ , తాతారావు, బి.నాగరాజేశ్వరీ పాల్గొన్నారు.

డ్రెయినేజీల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని శివారు కాలనీల్లో అంతర్గత డ్రెయినేజీల సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. సోమవారం స్థానిక ప్రజావేదికలో మున్సిపల్ ప్రత్యేక అధికారి జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ అధికారులతో శివారు కాలనీ, ధనియాలపేట, వాంబే కాలనీ, న్యూ ఇందిరానగర్ కాలనీల్లో రూ.10కోట్లతో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో గుడివాడ సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధిపరచాలని అధికారులకు సూచించారు. టిడ్కో కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్స్ ద్వారా వస్తున్న నీటి నాణ్యతను తెలుసుకునేందుకు ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యల పరిష్కారంపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఇంజినీరు ప్రసాద్, మున్సిపల్ డీఈలు శివాజీ, సతీష్‌చంద్ర టీడీపీ నాయకులు దింట్యాల రాంబాబు, పంద్రాజు సాంబశివరావు పాల్గొన్నారు.

గుడివాడ : పట్టణంలోని రైల్వేగేట్‌లపై నిర్మితమవుతున్న భారీఫ్లైఓవర్ బ్రిడ్జికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పేరు పెట్టాలని బాలశౌరి అభిమానులు కోరారు. సోమవారం స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు, ఆర్‌డీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యంలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకలుఉ పంద్రాజు సాంబశివరావు, బాలశౌరి అబిమానులు మహేష్, మణికుమార్, దిలేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

పామర్రు,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఎలకుర్రుకు చెందిన కొనకళ్ల లక్ష్మీదుర్గకు ఎమ్మెల్యే సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధినుంచి మంజూరైన రూ.29,461 చెక్కును సోమవారం బాధితురాలి ఇంటివద్దకు వచ్చి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పమిడిముక్కల : మేడూరు, కపిలేశ్వరపురం గ్రామాలకు చెందిన ముగ్గురికి రూ.1.89 లక్షల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సోమవారం అందజేశారు. మెరకనపల్లి ఎలీషాకు రూ. 50,700, సుగుణ శ్రీనివాసరావుకు రూ. 44,319, లంక సీతారామ కృష్ణకు రూ. 94,094 చెక్కులను అందజేశారు. కిడ్నీల డాయలసిస్ నిమిత్తం ద్వారా గంజాల వీరశ్రీనివాసరావుకు పీ-4 పథకం ద్వారా రూ. 10వేల ఆర్థిక సహాయం చెక్కు అందజేశారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐలయ్యకు గుర్రం జాషువా పురస్కారం

గుడివాడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : సామాజిక అసమానతలు మీద తన కలాన్ని కరవాలంగా ఝుళిపించి తన రచనలద్వారా పోరాటం చేసిన సామాజిక యోధుడు గుర్రం జాషువా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ నింపుకుని అసాంఘిక అసమానతలపై నిరంతరం పోరాటం చేసినప్పుడు కొంత మేరకు మార్పు వస్తుందని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ నేలపాటి శామ్యూల్ అన్నారు. తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్‌జీవోస్ హోంలో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నేలపాటి మాట్లాడుతూ ఎవరైతే జాషువా అని అసమానతలతో అవమానపరిచారో వారే ఆయనకు గండ పెండారం జాషువాకు తొడిగి ఘన సన్మానం చేశారన్నారు. అది పాండిత్యానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పిల్లలమర్రి అనిలేసు(ఐలయ్య)ను గుర్రం జాషువా సాహితీ స్ఫూర్తి పురస్కారం-2025ను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త ప్రసాద్, ఎన్‌జీవోస్ జిల్లా నాయకులు షేక్ ఫరీద్ భాషా, వివిధ సంఘాలకు చెందిన నేతలు గాదె మోహన్‌బాబు, వెంకటేశ్వరరావు, మోకా మాధవరావు, తిరుపాల్ గుప్తా, రూప, సురేంద్ర, శకుంతల, రాజకుమారి, అనీల్, లాజర్, శ్రీధర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఐలయ్యను సత్కరిస్తున్న తెలుగు భాషా వికాస సమితి సభ్యులు

యోగాంధ్ర అవార్డు గ్రహీతకు ఘన సత్కారం

గుడివాడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక ఏలూరురోడ్డులోని కృష్ణ మందిరంలో యాదవ సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి, యోగాంధ్ర అవార్డు గ్రహీత కిలారపు రంగప్రసాద్ దంపతులను ముఖ్య అతిధులుగా విచ్చేసిన యనమల నూకాలమ్మ, మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్ సతీమణి మధురిమలు ఘనంగా సత్కరించారు. తొలుత స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద దాసాంజనేయస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు లోయ అనంతలక్ష్మి, విఘ్నేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్త లోయ వాసులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, వేణుగోపాలస్వామి దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, వివిధ సంఘాల నాయకులు నరసింహరావు, ప్రసాదరావు, గొర్ల శ్రీను, శ్రీనివాసరావు, గొరిపర్తి మురళీ, లోయ రాజేష్, పెద్దిబోయిన వెంకటేశ్వరరావు, బొమ్మనబోయిన బాలాజీ, కొలుసు సతీష్, కుంభం నాగమణి, అంగడాల వేణు, దారం ఏడుకొండలు, కొలుసు లాలా, సుబ్రహ్మణ్యం, నల్లగంచు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రంగప్రసాద్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం సభ్యులు

సాంకేతిక పద్ధతులపై అవగాహన తప్పనిసరి

● డాక్టర్ సుధారాణి

కూచిపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులను రైతులకు వివరించాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం కాజలో పర్యటించి వ్యవసాయ పద్ధతులపై రైతులతో చర్చించారు. వ్యవసాయంలో సాంకేతిక మార్పులు, లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంటల సాగు వివరాలు, పంట విస్తీర్ణం, గ్రామ స్వరూపం మొదలగు అంశాలను గ్రామంలోని పీపీసీఎస్ వద్ద రంగవల్లులతో విశదీకరించారు. ఈ సందర్భంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించటంతోపాటు రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



గ్రామ స్వరూపాన్ని రంగవల్లుల రూపంలో వివరిస్తున్న విద్యార్థులు

సెరిబ్రల్ పాల్సిపై అవగాహన

పామర్రు,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎలకుర్రు కేడీబీ దివ్యాంగుల పాఠశాలలో సోమవారం ప్రపంచ సెరిబ్రల్ పాల్సి దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా నిడుమోలు యునియన్ బ్యాంక్ మేనేజరు ఎస్.ధనకుమార్ పాల్గొని వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా చిన్నారులకు వ్యాదినిరోధక టీకాలు ఇవ్వడం ద్వారా ఈ వ్యాధి రాకుండా నివారించవచ్చున్నారు. కేడీబీ ట్రస్టు కార్యదర్శి నాగేశ్వరరావు, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు : తెలుగు క్విజ్ విజేతలుగా ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు నిలిచారని పాఠశాల ప్రిన్సిపల్ కుంజుమన్ తెలిపారు. మచిలీపట్నంలో మహిత కళావేదికలో నిర్వహించిన కథ చెప్పడం ఎలా, తెలుగు క్విజ్ లలో తమ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారని కుంజుమన్ తెలిపారు. బహుమతులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా అందుకొన్నారన్నారు. విజేతలైన విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం, డైరెక్టర్ నారాయణం శ్రీనివాస మూర్తిలు అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

గుడివాడ : విజయవాడ, తాడిగడపకు చెందిన బుడితి సతీష్ తన భార్యతో కలిసి పని నిమిత్తం గుడివాడ వచ్చాడు. తిరుగు ప్రయాణంలో నాగన్న చెరువు వద్ద రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఏపీ 39యూబీ 3553 ఐచర్ వాహనం సతీష్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. కిందపడిన సతీష్ కుడికాలు పాదం పైకి లారీ టైర్ ఎక్కడంతో గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం బాధితుడిని ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై లవరాజు తెలిపారు.

ఘనంగా వడ్డే ఓబన్న వర్ధంతి

గుడివాడ : స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న 179వ వర్ధంతి సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత స్థానిక కోతిబొమ్మ సెంటర్ నుంచి నాగవరప్పాడు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.నాయకులు లక్ష్మణరావు, పట్టణకమిటీ నాయకులు బండి శ్రీను, చల్లా ప్రసాద్, ఓర్సు రాములు, చల్లా చిన్ని, హనుమంతు, జమలయ్య పాల్గొన్నారు.

ఈ-క్రాపు నమోదు వేగవంతం చేయాలి

గుడివాడ : పంట నమోదు ప్రక్రియ కేవలం 60శాతం మాత్రమే అయ్యిందని, మిగిలిన రైతులూ నమోదు చేయించుకునేలా వీఏఏలు బాధ్యత తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శొంఠి ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందు అందుబాటులో ఉందన్నారు. మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కౌతవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యపరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి ఏలూరుకు చెందిన ఆశ్రమ్ నేత్ర వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి ఆసుపత్రివారే ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని కౌతవరం పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి యుగంధర్ తెలిపారు. 84 మందికి కళ్లజోళ్లు అవసరంగా వైద్యులు గుర్తించి, వారికి ఉచితంగా పీఏసీఎస్ నిధులు రూ.40000లతో ఏర్పాటు చేస్తున్నామని యుగంధర్ తెలిపారు. కౌతవరం గ్రామస్థులు, సంఘ సభ్యులు, సిబ్బందిలకు ఈ పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. గుడ్లవల్లేరు కేడీసీసీ బ్రాంచ్ మేనేజరు మల్లేశ్వరి, సూపర్‌వైజరు ప్రకాష్, కౌతవరం పీఏసీఎస్ సెక్రటరీ భరత్, డైరెక్టర్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్ యుగంధర్

500 గ్రాముల గంజాయి స్వాధీనం

పెదపారుపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెదపారుపూడి శివారు పెదపారుపూడి నుంచి గుర్విందగుంట గ్రామం వైపు వెళ్లే రోడ్డులో ఉన్న పెదపారుపూడి శ్మశానవాటిక వద్ద షేక్ అల్లా నబీ (రావులపాడు గ్రామం) అనే వ్యక్తి వద్ద ఒక సంచిలో 500 గ్రాముల గంజాయిని కలిగి ఉన్నాడు. అతను పోలీసు వారి వాహనం చూసి పారిపోవుతుండగా, ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి వారి సిబ్బంది సహాయంతో చుట్టుముట్టి పట్టుకొని సదరు గంజాయిని సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి ఇంటిలో పెంచుతున్న గంజాయి మొక్కని సీజ్ చేసినట్లు పామర్రు సీఐ శుభాకర్ తెలిపారు. నిందితుడిని మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చామని ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.



పమిడిముక్కలలో..



కూచిపూడిలో..



పెదపారుపూడిలో..

స్వచ్ఛ వారియర్స్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డులు

పమిడిముక్కల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) :తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్వచ్ఛ స్కూల్ అవార్డు లభించింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో తాడంకి స్కూల్‌కు స్వచ్ఛ స్కూల్ అవార్డుకు ఎంపిక కాగా మచిలీపట్నం జిల్లాపరిషత్ కన్వెన్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానత్సవంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిలాకలెక్టర్ డీకే బాలాజీ నుండి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై. శివనాగప్రసాద్ స్వచ్ఛ స్కూల్ అవార్డు అందుకున్నారు. **కూచిపూడి :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర అవార్డుకు కృష్ణా జిల్లా స్థాయిలో ఎంపికైన పామర్రు నియోజకవర్గంలోని మొవ్వ మండల కాజ ప్రభుత్వ ఆయుర్వే వైద్యశాల అధికారిణి డాక్టర్ ఎం.భాగ్యలక్ష్మి సోమవారం సాయంత్రం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ డీకే బాలాజీల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఆమెను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. **పెదపారుపూడి :** జిమిదింటకుర్రుకు చెందిన సర్పంచ్ పునుకొల్లు శివరాం ప్రసాద్, కార్యదర్శి గంటా కృష్ణవేణి మచిలీపట్నంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డు కార్యక్రమంలో జిల్లా స్థాయిలో అవార్డును అందుకున్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

గుడివాడ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. సోమవారం డీఎస్పీ మల్లాయిపాలెంలో ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ఖరీదు రూ.1000లు అని, కానీ ప్రాణం విలువ అత్యంత విలువైనదని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రూరల్ ఎస్సై చంటిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక

పమిడిముక్కల : తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలను సర్పంచ్ జంపాన ధనలక్ష్మి సోమవారం ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు రేవతి, టీడీపీ సీనియర్‌నాయకుడు జక్కాశ్రీనివాసరావు పాల్గొన్నారు.

తోమాటి సుధాకర్‌కు సత్కారం

గుడివాడ : స్వచ్ఛంద సేవకులు వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఢిల్లీలో ఆంధ్ర భవన్‌లో నేషనల్ యంగ్ కమ్యూనిటీ అవార్డుకు ఎంపికైన మాతృ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోమాటి సుధాకర్‌ను స్థానిక పెద ఎరుకపాడులోని ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో రాష్ట్ర యునైటెడ్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదాసు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు యు.రాంబాబు, నరసింహారావు, నాగరాజు, జి.వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి రంగంలో ఉపాధి అవకాశాలు అధికం

● ట్రైనర్ జి.రాజశేఖర్‌రెడ్డి

గుడివాడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో పెట్టుబడి రంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని, వీటిని అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రయత్నం ప్రారంభించాలని సెక్యూరిటీ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా ట్రైనర్ జి.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవం సందర్భంగా పెట్టుబడి రంగంలో గల వివిధ అవకాశాలు, పెట్టుబడులు పెట్టిన తరువాత వాటి రక్షణ ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్ల, బీకాం విభాగాధిపతి ఎ.గ్రీష్మ, పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ట్రైనర్ రాజశేఖర్‌రెడ్డి

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు కలుగుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. జీఎస్టీతగ్గింపుపై ప్రజలకు అవగాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం కృష్ణాపురంలో నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ డీడబ్ల్యూ ఎంఎ శివ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పామర్రు : కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సూపర్ జీఎస్టీపట్ల గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతుల్ని చేసే బాధ్యత గ్రామ కూటమి నేతలు తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీనేతలకు సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన సదస్సు మంగళవారం జరుగుతుందని ఎంఈవో బాలాజీ సోమవారం తెలిపారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నామన్నారు.



కృష్ణాపురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

కృష్ణసాయి మందిరంలో మహా కుంభాభిషేకం నేడు



చల్లపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పురిటిగడ్డలోని శ్రీకృష్ణసాయి మందిరం 12వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నాదెళ్ల శివరామకృష్ణ తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి వార్షికోత్సవాలు జరుగుతుండగా, మంగళవారం ఉదయం నిత్య మండపారాధన, హోమాలు, మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, షిరిడి సాయిబాబాకు అన్నాభిషేకం, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈమేరకు మందిరాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.



సొర్లగొందిలో ఎస్టీలకు పీతల బాక్సులను అందించి, నాలిలో చేపల మేతల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మండలి

యానాదులు ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే మండలి

నాగాయలంక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యానాదులు బ్యాంకులు, సంస్థలు అందిస్తున్న ఆర్థిక సహకారాలతో ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నాలి గ్రామంలో నాబార్డు 15 లక్షల ఆర్థిక సహకారంతో ప్రజా ప్రగతి సేవా సంఘం ఆధ్వర్యంలో మర్రిపాలెం, తలగడదీవి, కమ్మనమోలు, సంగమేశ్వరం, భావదేవరపల్లి గ్రామాలకు చెందిన 20 మంది ఎస్టీ మహిళలకు ఏర్పాటు చేసిన చేపల మేత తయారీ యూనిట్‌ను బుద్ధప్రసాద్ ప్రారంభించారు. నాలిలోని 40 మత్స్యకార కుటుంబాలకు హెచ్‌ఎస్‌బీసీ, కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ సాయం రూ.40 లక్షలతో 40 ఎకరాలలో రొయ్యల చెరువులు తవ్వించే పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రజాప్రగతి సేవా సంఘం అధ్యక్షులు పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాబార్డు అందించిన ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండు కింద యానాదుల జీవన ప్రమాణాల పెంపొందించేందుకు చేపడుతున్న ప్రగతిని వివరించారు. సొర్లగొందిలోని ఎస్టీలకు పీతల బాక్సులను ఎమ్మెల్యే అందించారు. సర్పంచ్ నాయుడు బాలకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, కొప్పనాతి చిన వెంకటేశ్వరరావు, నక్కా విజయబాబు, అవనిగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉదయ్ కుమార్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారం



ఉదయ్‌కుమార్‌కు పురస్కారం అందిస్తున్న ప్రతినిధులు

నాగాయలంక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ కె.ఉదయ కుమార్‌ను మరో పురస్కారం వరించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాన్ని ఆదివారం రాత్రి ఆయన అందుకున్నారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రత్నషీలామణి, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, మెడికల్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఎన్.వీరప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, కార్యదర్శి కె.ఆలీస్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఎంఈవో ఏ.రామారావు, పాఠశాల హెచ్‌ఎం ఏ.సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

నందిగంలో సచివాలయ భవనం ప్రారంభం



పెడన రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : యంత్రాంగం ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రభుత్వ పాలన ఉంటుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. నందిగం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎంపీడీవో అరుణకుమారి, తహసీల్దార్ అనిల్‌కుమార్, డీఈ సిహెచ్ నగేష్, ఏఈ ధర్మయ్య, సర్పంచ్ బొడ్డు చినబాబు, ఉప సర్పంచ్ కాగిత లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శీరం ప్రసాద్ పాల్గొన్నారు.

చల్లపల్లి మసీదు కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి



వక్ఫ్‌బోర్డు సీఈవో ఆలీకి వినతి పత్రం అందజేస్తున్న ముస్లింలు

చల్లపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలోని మస్జీద్ ఏ మహమ్మదీయ మసీదుకు (పెద్ద మసీదు)కు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల ముస్లింలు కలెక్టర్ డీకే బాలాజీ, వక్ఫ్‌బోర్డు సీఈవో మహమ్మద్ ఆలీకి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు మసీదు కమిటీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, గత 20 ఏళ్ల నుంచి రాజకీయ పలుకుబడితో ఎన్నికలు జరగకుండా కమిటీ నియామకం చేయించుకుంటున్నారన్నారు. షేక్ రసూల్ షెరీ, పఠాన్ కరీముల్లాఖాన్, అమీర్‌బేగ్, జహీర్, అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



చల్లపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఊరేగింపుల్లో ముందస్తు అనుమతులు లేకుండా ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చల్లపల్లి ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఊరేగింపుల్లో అనుమతి తీసుకున్న మేరకు మాత్రమే డీజేలు, మైకులు పెట్టుకోవాలన్నారు. యార్లగడ్డలో నిబంధనలను అతిక్రమించటంతోపాటు అనుమతుల గురించి ప్రశ్నించిన పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకపరిచిన వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

చండిక శంకరబాబుకు మంత్రి రవీంద్ర నివాళి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ రూరల్ మండల మాజీ అధ్యక్షుడు చండిక శంకరబాబు అందించిన సేవలు మరచిపోలేమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం చిట్టిపాలెంలో మృతిచెందిన శంకరబాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, తలారి సోమశేఖర్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



ఘంటసాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో పాడి రైతులకు సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్ సోమవారం బోనస్ చెక్కులు అందజేశారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు పాలుపోసిన 280 మందికి రూ.2,02,179 లు అందజేశారు. సురేష్ మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ వారి సహకారంతో క్షీరబంధు పథకం కింద ఆరుగురికి రూ.3లక్షలు, కల్యాణ మస్తు పథకంలో నలుగురికి రూ.80 వేలు అందించినట్లు తెలిపారు.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ రేపు

అవనిగడ్డ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఏడో వార్డులో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ జరిగే హనుమాన్, లక్ష్మణ సమేత కోదండ రామస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవార్ల గ్రామోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేదాంతం పార్థసారథి, శ్రీనివాస దీక్షితుల బ్రహ్మత్వంలో నిర్వహించిన గ్రామోత్సవంలో శ్రీ వెంకట సీతారామ సేవా సమితి చైర్మన్ దేసు అన్నపూర్ణాదేవి, బెజవాడ ధన సురేష్, చెన్నగిరి లోకేశ్వరరావు, కొల్లిప రాధకృష్ణ, నాగేశ్వరరావు, లుక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ డీఆర్కే ప్రసాద్ దంపతులు | అవార్డు అందుకుంటున్న సర్పంచ్ కైతేపల్లి అంకాలు | ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ అవార్డు అందుకుంటున్న రంగారావు

మన కోసం మనం ట్రస్ట్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు

చల్లపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఎన్‌జీవోగా చల్లపల్లికి చెందిన మన కోసం మనం ట్రస్ట్‌కు స్వచ్ఛ ఆంధ్ర జిల్లా అవార్డును సాధించింది. మచిలీపట్నంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీల చేతుల మీదుగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీఆర్కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి దంపతులు అవార్డును స్వీకరించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి పాల్గొన్నారు. చల్లపల్లి గ్రామంలో స్ఫూర్తివంతంగా స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డీఆర్కే దంపతులు మన కోసం మనం ట్రస్ట్ ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అనేక అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టారు.

నాగాయలంక పంచాయతీకి..

నాగాయలంక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డును నాగాయలంక పంచాయతీ సర్పంచ్ కైతేపల్లి అంకాలు, కార్యదర్శి పవన్ కుమార్ మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ ఊసల రంగారావు

పెడన రూరల్ : నందమూరు గ్రామ గ్రీన్‌అంబాసిడర్ ఊసల రంగారావుకు ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ అవార్డును ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ డీకే బాలాజీ చేతులమీదుగా బందరులో అందుకున్నారు. ఎంపీడీవో అరుణకుమార్, ఏఈ ధర్మయ్య, సెక్రటరీ జానకీదేవి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

నాగాయలంక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అభివృద్ధి పనులలో భాగంగా మంగళవారం నాగాయలంకలో విడతల వారీగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జి.వెంకటరాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. **కోడూరు :** మెయింటినెన్స్‌లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. ఇరాలి, ద్వారకా, రామకృష్ణాపురం గ్రామంలో ఇరాలి ఫీడర్ కింద ఉన్న ఆక్వా సర్వీసులకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్కూల్ గేమ్స్ వాయిదా

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈనెల 8వ తేదీన జరగాల్సిన బాల్‌బాడ్మింటన్ పోటీలు, 9వ తేదీన జరగాల్సిన స్విమ్మింగ్, 10న జరగాల్సిన జిమ్నాస్టిక్స్, త్రోబాల్ పోటీలు అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు కార్యదర్శి అరుణకుమారి తెలిపారు. ఈనెల 23న జరగాల్సిన నెట్‌బాల్ సెలక్షన్స్ 9వ తేదీకి మారినట్లు తెలిపారు.



జీఎస్టీ తగ్గింపు కరపత్రాలు అందజేస్తున్న కొనకళ్ల నారాయణరావు | బందరులో కార్పొరేటర్ నాగరాము, చిన్నాపురంలో కాగిత వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డ్రైవర్లు

జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతికి మేలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు కలిగిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. రామానాయుడుపేట సెంటర్లో కూటమి నాయకులతో కలిసి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు వివరించారు. దేశీయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారన్నారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, లోగిశెట్టి వెంకటస్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



లేడీయాంప్తిల్ కళాశాలలో విద్యార్థినుల ర్యాలీ

విద్యార్థులకూ మేలు..

జీఎస్టీ సంస్కరణల వల్ల విద్యార్థులకూ మేలు చేకూరిందని ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ ఎం. సౌమ్య అన్నారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై సోమవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం. సౌమ్య, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్వరూపరాణి, అబ్దుల్ సలాం, సర్దార్ పాషా, లంకిశెట్టి హరనాథబాబు, మమత, ము స్వర్, సురేష్, శ్రీనివాస్, విజయశ్రీ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

మచిలీపట్నం టౌన్ : ఆటోడ్రైవర్లకు కూటమి ప్రభుత్వంలోనే మేలు చేకూరిందని టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము అన్నారు. 27వ వార్డు సచివాలయం వద్ద సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు ఆటో డ్రైవర్లతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు అజీమ్ తదితరులు పాల్గొన్నారు. ఆటోడ్రైవర్లకు చంద్రబాబు రూ. 15వేలు ఆర్థిక సాయం అందించి ఊరట కల్పించారని మాజీ ఎంపీపీ, టీడీపీ రూరల్ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. చిన్నాపురంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు సోమవారం ఆటోడ్రైవర్లతో కలిసి కాగిత వెంకటేశ్వరరావు పాలాభిషేకం చేశారు. గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, ఉపసర్పంచ్ కాట్రం నాంచారయ్య, పీఏసీఎస్ చైర్మన్ వినిశెట్టి నిరంజనరావు, రాజులపాటి సత్యనారాయణ, వెంకటేశ్వర ఆటో యూనియన్ నాయకులు ఆరేపల్లి కిషోర్, డాన్ శ్రీను, దాసరి గోవర్ధన్, వడ్డి వనజారావు, పా మర్తి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కలంకారీ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి తీరుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, వేదికపై చేనేత ప్రముఖులు

పెడన, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, అవరోధాలు కల్పించినా పెడనలో కలంకారీ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి తీరుతానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. కలంకారీ క్లస్టర్‌కు భూముల కేటాయింపును కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు వ్యతిరేకించిన నేపథ్యంలో కలంకారీ ఆర్టిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో కలంకారీ కార్మికులు, కలంకారీ పారిశ్రామికవేత్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బళ్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, వేలాది మంది కలంకారీ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం తలపెట్టిన కలంకారీ క్లస్టర్‌ను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ కౌన్సిలర్లు మనసు మార్చుకుని భూముల కేటాయింపుల విషయంలో పునరాలోచన చేయాలని ఆయన సూచించారు. జనసేన పార్టీ నాయకురాలు, కౌన్సిలర్ మట్టా శివపావని మాట్లాడుతూ, క్లస్టర్‌ను వ్యతిరేకించవద్దని కౌన్సిల్‌లో తాను ఎంత తగానో చెప్పినా వైసీపీ కౌన్సిలర్లు వినకపోగా తనను ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని ఆరోపించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణ పరిధిలోని ఆరుగురికి కృష్ణప్రసాద్ సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. తమ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పైడమ్మ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. కలంకారీ ఆర్టిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి జంపాన శ్రీనివాసరావు, సభ్యులు ఊటుకూరి శ్రీగిరి, కట్టా మునేశ్వరరావు, కట్టా మూర్తి, మాజీ వైస్‌చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం, కౌన్సిలర్ బళ్ళ పద్మాతి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, బీజేపీ అధ్యక్షుడు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెడన రూరల్ : నియోజకవర్గ కార్యాలయంలో 64 మందికి రూ.31.52 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవినిలాంటిదన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శీరం ప్రసాద్ కట్టా మునేశ్వరరావు పాల్గొన్నారు.

కళలు, కళాకారులను ప్రోత్సహించాలి

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



తాళం భజన పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న యండకుదురు భక్త సమాజం

ఘంటసాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సాంస్కృతిక రంగానికి పెద్ద పీట వేసి, నాటకం, మురళీ కోలాటం, తాళం భజన వంటి వాటిని ప్రభుత్వం ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చిట్టూర్పు గ్రామంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో నిర్వహించిన తాళం భజన, మురళీ కోలాటం పోటీల్లో విజేతలకు సోమవారం దేవస్థానం ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మరుగున పడుతున్న ప్రాచీన కళలైన తాళం భజన, మురళీ కోలాటం పునర్వైభవానికి కృషి చేస్తున్న నిర్వాహకులు గుత్తికొండ వరప్రసాద్ అభినందించారు. రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ కళలు మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు జిల్లాల స్థాయిలో జరిగిన తాళం భజన పోటీలకు 28 సమాజాలు పోటీ పడగా, ఘంటసాల మండలం యండకుదురు గ్రామానికి చెందిన గీతాభక్త సమాజం మొదటి బహుమతిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. యండకుదురుకు చెందిన భక్తసమాజం ఆర్గనైజర్ సిద్ధినేని ప్రమీలారాణి, బత్తిన విజయలక్ష్మి, శీరం రామాంజనేయులు తదతరులు బహుమతి అందుకున్నారు. మురళీ కోలాటం పోటీల్లో 12 సమాజాలు పోటీ పడగా, మోపిదేవి మండలం కోసూరువారిపాలెం అనంతకోటి వేణుగోపాల ముద్దుల కోలాటం సమాజం ప్రథమ బహుమతి పొందింది. వారికి బహుమతిని, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు అధ్యక్షత వహించగా, శ్రీనివాస విద్యాసంస్థల అధినేత పరుచూరి శ్రీనివాస్, యార్లగడ్డ శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, నాదెళ్ల నరసయ్య, శివరామకృష్ణ, పరిశె చలపతి, గుత్తికొండ వరప్రసాదరావు, గుత్తికొండ స్వరాజ్యలక్ష్మి, దాసరి సతీష్, వేములపల్లి సుధీర్, పాటిబండ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరకాండ ప్రవచనం నేటి నుంచి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, టీటీడీ ధర్మ ప్రచార విభాగ ప్రవచకులు వడ్లమన్నాటి మారుతీ దివాకరశర్మచే సువర్చలా సమేత అంజనేయ స్వామి ఆలయంలో సుందరకాండ ప్రవచనం జరుగుతుందని ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమేష్ తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈవో టివివి మోహనరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మో పర్తి ఉమాదేవి, శివనాగేశ్వరరావు, విశ్వనాథపల్లి నాగరాజు, శ్రీనివాస్, కనకదుర్గ, రాజేష్, నాయకులు పి.వి.ఫణికుమార్, సుబ్రహ్మణ్యం, శర్మ, సీతాపతిరావు పాల్గొన్నారు.